# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 13 విజయవాడ 5-11-2011 పేజీలు : 8 వెల: రు 5.00


లోపలి పేజీల్లో...


- భారత-అమెరికా అణుఒప్పందం-తొలగినభ్రమలు
- విజృంభిస్తున్న హిందుత్వవాద ఫాసిజం
- కూడంకులం అణువిద్యుత్ కేంద్ర నిర్మాణం-ప్రజల నిరసనాందోళన
- కరువు రైతాంగానికి సహాయక చర్యల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- జన్యుమార్పిడి పంటల పరిశోధనాక్షేత్రంగా మలచబడ్డ భారతదేశం
- కార్మికులను దోపిడీ చేస్తున్న యాజమాన్యాలకు మద్దతుగా నిలుస్తున్న ప్రభుత్వాలు


## నిరుద్యోగుల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టేందుకే రాజీవ్ యువకిరణాల పథకం

**రానున్న** మూడు సంవత్సరాలల్లో రాజీవ్ యువ కిరణాల(ఆర్‌యూకె) పథకంద్వారా 15 లక్షలమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్రప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తోంది. డిశంబరు నెలలో ఒకేరోజున లక్షమందికి నియామక ఉత్తర్వులిస్తామని కూడా ప్రకటిస్తున్నది.

అంతేగాక ప్రభుత్వ కార్యాలయాలల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో వున్న 1.16 లక్షల ఉద్యోగాల భర్తీకోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, పోలీస్ నియామక బోర్డు, జిల్లా ఎంపిక కమిటీ (డిఎస్సీ) వంటివి ప్రవేశపరీక్షల క్యాలండర్‌ను రూపొందించి, వచ్చే డిశంబరులోపుగా ప్రకటిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పై రెండు ప్రకటనలు నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తించుతాయి. వీటి వివరాలను, వస్తుగతంగా వున్న వాస్తవాలను పరిశీలించితే మరోమారు నిరుద్యోగ యువతలో భ్రమలు కల్పించేందుకేననేది స్పష్టమౌతుంది.

### రాజీవ్ యువకిరణాల పథకం

దీనికోసం రాజధానిలోను, ప్రతిజిల్లా కేంద్రంలోను ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఆ జిల్లాలో వున్న నిరుద్యోగుల వివరాలు సేకరిస్తారు. కనీసం పదోతరగతి విద్యార్హత కల్గిన నిరుద్యోగులు నమూనా దరఖాస్తులో వివరాలురాసి పంపుకోవాలి. నిర్మాణరంగం, రిటైల్ మార్కెటింగ్, ఆస్పత్రులు వగైరా రంగాలలో అవకాశాలుంటాయని, ఆ పరిశ్రమల వారితో ఒప్పందాలు కుదుర్చుకోవటం జరుగుతుందని, అవసరమైన ఉద్యోగాలకు 15 నుండి నెలరోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని-వీరికి డిశంబరులో ఒకేరోజున లక్షమందికి నియామక పత్రాలు అందచేస్తామని, కనీస వేతనం యివ్వటం జరుగుతుందని తెలిపింది. ఒకవైపున పరిశ్రమలకు అవసరమైనవారు దొరకడంలేదని, మరోవైపున చదువుకున్నవారికి ఉద్యోగాలు లభించడం లేదని, యీ రెండిటిమధ్య సమన్వయ అవసరం వుంటుందని ప్రభుత్వం ప్రకటించింది.

నేటి కార్మికరంగం స్థితిగతులు ఎలావున్నాయో ఒకసారి పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రయివేటురంగ సంస్థలు కాంట్రాక్టు, ఔటుసోర్సింగ్ పద్ధతులద్వారా కార్మికులను, ఉద్యోగులను నియమించుతున్నాయి. పర్యవసానంగా వేతనస్కేలు, ఇతర సౌలభ్యాలు కోల్పోవడమేగాక ఉద్యోగ భద్రత, హక్కులు లేకుండా పోతున్నాయి. ఎనిమిది గంటల పని విధానాన్ని పెంచివేసి, వెట్టిచాకిరీకి పాల్పడుతున్నాయి. రెగ్యులర్ కార్మికుల పని దినాన్ని పెంచేందుకు కార్మిక చట్టాలను సవరించేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగించుతున్నాయి. గతంలో ఎన్నో పోరాటాలు సాగించి, సాధించుకున్న చట్టపరమైన రక్షణలను కుదించటం, ఉపసంహరించటం జరుగుతోంది. మరోవైపున కార్మికవర్గం నిర్మించుకున్న ట్రేడ్‌యూనియన్ల మధ్య అనైక్యతను రెచ్చగొడుతున్నది. తమ హక్కులు, వేతన పెంపుదల, సౌలభ్యాలసాధనకోసం కార్మికవర్గం సాగించుతున్న సమరశీల పోరాటాలను పోలీసులతో అణచివేయటం, నిర్బంధాలు సాగించడం జరుగుతోంది. ఈ విధంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టడంలేదు. సరిగదా గతరెండు దశాబ్దాలుగా పాలకులు అవలంబిస్తున్న నయాఉదారవాద ఆర్థిక విధానాలు, కార్మికుల స్థితిగతులను మరింత దిగజార్చేవిధంగా వుంటున్నాయి. వీటిని సరిదిద్దే విధానాలు చేపట్టకుండా పదిహేను లక్షలమందికి మూడేళ్ళల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చేసే ఆర్భాటపు ప్రకటనలు మోసపూరితమైనవే.

### ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో పోస్టుల భర్తీ

1.16 లక్షల పోస్టుల భర్తీకోసం డిసెంబరులో ప్రవేశపరీక్షల నిర్వహణకు ప్రభుత్వం క్యాలండర్ రూపొందించి ప్రకటించుతానన్నది. ఈ ఖాళీలు విద్యాశాఖ, హోంశాఖ, ఇంధనశాఖ, రెవిన్యూ వగైరా శాఖల్లో వున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో దాదాపు 3 లక్షల పోస్టులు ఖాళీగా వుంటే భర్తీచేయక కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలద్వారా కాలం వెళ్ళబుచ్చుతోంది. అందువలన కనీసపాటి ప్రజాసమస్యలు సకాలంలో పరిష్కారంకాక వారు ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాలలో సాగే రెడ్‌టేపిజం, అవినీతి గురించి చెప్పనవసరంలేదు.

విద్యాసంస్థల్లో సబ్జక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేక బోధనా కార్యక్రమాలు సరిగ్గా సాగక విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. అనివార్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేట్ విద్యాసంస్థలకు పంపించుకోవల్సిన పరిస్థితులకు నెట్టబడుతున్నారు. దీనితో విద్యాప్రయివేటీకరణ, వ్యాపారీకరణ అడ్డగోలుగా విస్తరించుతూ ప్రజలను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి లోపించి, సామాజిక అవగాహనకు బాధ్యతకు దూరమవుతున్నారు.

ఆపద్ధర్మంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావలంటీర్లను కొన్ని నెలలు గడిచాక నియమిస్తున్నారు. వారికిచ్చే వేతనం ఏ నెలకానెల అందదు. ప్రభుత్వ కళాశాలలు అందుకు భిన్నంగా లేవు. విద్యాసంస్థల్లో నియామకమవుతున్న కంప్యూటర్ టీచర్లకు కనీస వేతనం రు.6,300/లు కూడా చెల్లించడంలేదు. రు.2000లు అదీ ఏ నెలకానెల ఇవ్వరు. తమ కనీసవేతనం, తదితర డిమాండ్ల సాధనకోసం గత ఏడువారాలుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇక, ప్రవేశ పరీక్షల పేరుతో నెలల తరబడి కాలయాపన జరుగుతోంది. ఫలితాలు ప్రకటించినా అందుకనుగుణంగా నియామకాలు జరపక జాప్యం చేస్తున్నారు. ఈ విధంగా నియామక విధానాలను సక్రమంగా అమలుచేయక ప్రభుత్వ కార్యాలయాలలో పౌరసేవలు లభించక ప్రజలు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రతి పనికి నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగవలసిన పరిస్థితులు కల్పించుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దుచేయడం అవసరం. ఇది జరగకుండా ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా ప్రయోజనంలేదు. ఖాళీలు భర్తీచేయడమేకాదు, జనాభా ప్రాతిపదికగా నూతన పోస్టులు కల్పించి, వాటిని భర్తీచేసి పౌరసేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

కనుక ఈ నేపథ్యంలో కాంట్రాక్టు విధానాలను, ఔట్ సోర్సింగ్ విధానాలను మొదట రద్దుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన స్కేలును ఇతర సౌలభ్యాలను కొనసాగించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయాలి. వీటిని చేపట్టకుండా లక్షలమందికి ఉపాధి కల్పిస్తామని చెప్పటం, అది కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా కొలగొట్టడానికే. అందువల్ల గత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల అమలుకోసం, నూతన ప్రజాతంత్ర వ్యవస్థ సాధన దిశగా కార్మిక వర్గం ఐక్య సమరశీల పోరాటలు సాగించటమే కర్తవ్యం.

D

సంపాదకీయం

## పెట్టుబడిదారీ విధానం, స్వేచ్ఛామార్కెట్టు విధానాలు మానవాభివృద్ధిని చేకూర్చవు! మానవాళిని మరింత దౌర్భాగ్యస్థితిలోకే తోసివేస్తాయి!!

**పెట్టుబడిదారీవిధానం,** స్వేచ్ఛా మార్కెట్లు మాత్రమే సంపదను అభివృద్ధిపరచి, పేదరికాన్ని పారద్రోలుతాయనే అపసవ్యపు, అబద్ధపు సిద్ధాంతాలు ఈరోజు ప్రపంచమంతటా రాజ్యమేలుతున్నాయి.

సామ్రాజ్యవాద దోపిడీని ముమ్మరంచేసి, మానవాళిని మరింత దురవస్థలోకి దిగజార్చే ఈ నయాఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను, అత్యంత భక్తిప్రపత్తులతో తలకెత్తుకొని, అకుంఠిత దీక్షతో సామ్రాజ్యవాదులకు దళారీలుగా వ్యవహరిస్తున్న మన పాలకులు, పాలకవర్గాలూ, ఈ దోపిడీ విధానాలను పకడ్బందీగా గత రెండు దశాబ్దాలుగా మనదేశంలో అమలుచేస్తున్నాయి.

ఇవి దోపిడీ విధానాలనీ, యివి ప్రజల స్థితిగతులను అభివృద్ధిచేయకపోగా, వారిని మరింత దుస్థితివైపుకు నెట్టివేస్తున్నాయని, అనుభవపూర్వకంగా గ్రహించిన అశేష ప్రజానీకం మొత్తుకొంటున్నా, ప్రజల అనుభవపూర్వక దురవస్థను పట్టించుకోకుండా, 'అదేంలేదు, దేశం అభివృద్ధిపథంలో ముందుకు దూసుకుపోతోంది' అంటూ, ఆర్థికాభివృద్ధిరేటు పెరుగుదల అన్న అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ, వాస్తవాన్ని మొండిగా కొట్టిపారేస్తున్నారు.

అయినా,

ఈ సామ్రాజ్యవాద దోపిడీ పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థిస్తున్నవారూ, ఈ దోపిడీ విధానాలను ఆచరణలో అమలుజరుపుతున్నవారూ ప్రకటించిన 'మానవాభివృద్ధి సూచికలు' అనబడేవే- వీరు ప్రవచిస్తున్న, అమలుజరుపుతూవున్న నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానాలు మానవాభివృద్ధిని సాధించకపోగా, అవి మానవాళిని మరింత దుస్థితి పాలుచేస్తాయనే అంశాన్ని నిరూపిస్తూ, ఆ వాస్తవాన్నే వక్కాణిస్తున్నాయి.

అటు ఐక్యరాజ్య సమితి ప్రకటించిన అభివృద్ధి సూచిక-2011కానీ, ఇటు భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అప్లయిడ్ మ్యాన్ పవర్ రిసెర్చి అనే సంస్థచే రూపొందించబడి, ప్రణాళికాసంఘ ఉపాధ్యక్షుడు, మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా విడుదలచేసిన 2011, భారత మానవాభివృద్ధి సూచికగానీ, ఆర్థికాభివృద్ధిఅనేది-మానవాభివృద్ధికి కొలబద్దకానేకాదనీ, ఆర్థికాభివృద్ధివల్ల మానవాభివృద్ధి సాధ్యంకాకపోగా, మరింతగా దిగజారిపోతుందనే వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి.

ఐక్యరాజ్య సమితి సూచిక ప్రకారం ప్రపంచంలో అసమానతలస్థాయి మరింతగా పెరిగిపోయింది. ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఆదాయాలలోని అసమానతలు కూడా పెరిగిపోయాయి. నయాఉదారవాద ఆర్థిక విధానాలకు నాయకత్వం వహిస్తున్న అమెరికాదేశం మానవాభివృద్ధి సూచికలో 4వ స్థానానికి పడిపోయింది. అసమానతలు పెరిగిపోయి, అసమానతల సర్దుబాటు స్థాయిలో 23వ స్థానానికి పడిపోయింది. గతంలోని ఎన్నో దశాబ్దాలనాటి అసమానతల స్థాయికన్నా, ఈరోజు అమెరికా మరింతగా దిగజారిపోయింది. ఆదాయ పంపిణీ అన్నది గతంలోకన్నా, ఎక్కువ మేరకు అసమానత స్థాయికి దిగజారిపోయింది.

ఇదే నివేదిక ప్రకారం భారతదేశం, తనకన్నా తక్కువ అభివృద్ధిచెందిన దేశాలలోకన్నా మానవాభివృద్ధి స్థాయి మరింత తక్కువగా వుంది. సామ్రాజ్యవాద యుద్ధంతో నాశనంచేయబడ్డ ఇరాక్ దేశంకన్నా, ఫిలిప్పిన్స్‌కన్నా తక్కువ స్థాయిలో వుంది. భారత దేశంలో స్త్రీ-పురుషుల మధ్యగల అసమానత్వం, దక్షిణాసియా దేశాలన్నింటిలోకన్నా హెచ్చుస్థాయిలో వుంది. భారతదేశంలో కొన్ని అంశాలలో గణనీయమైన అభివృద్ధి కన్పడుతన్నప్పటికీ, ఈ అభివృద్ధి చలనమార్గాన్ని విపరీతంగా పెరిగిపోయిన అసమానతలు, పర్యావరణ ప్రమాదాలు రద్దుచేస్తాయి అని, ఐక్యరాజ్యసమితికి మానవాభివృద్ధిశాఖకు చెందిన డైరెక్టరు కైట్లిన్ వీసెన్ చెప్పటం ప్రత్యేకంగా గమనార్హమైన విషయం. ఈ ఐక్యరాజ్యసమితి నివేదిక, భారతదేశంలో బహుముఖాలుగా పేదరికంలోకి కూరుకుపోయిన ప్రజలు, ప్రపంచం మొత్తం మీదనే అధిక సంఖ్యలో వున్నారనీ, వారి సంఖ్య 612 మిలియన్లుగా వుందనీ తెలియచేస్తోంది. ఆదాయాల అసమానతల విషయంలో మనకన్నా బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలే మెరుగైన స్థితిలో వున్నారు. అదేరకంగా విద్యను కల్పించటంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు మనకన్నా మెరుగైన స్థితిలో వున్నాయి. ఇంకా విచిత్రమేమిటంటే, ముస్లిం ప్రజలు మెజార్టీగావున్న ఈ దేశాల్లో, మనదేశంలోకన్నా స్త్రీ-పురుషుల మధ్యగల అసమానత స్థాయి తక్కువగా వుంది.

ఇక భారత ప్రభుత్వం తరపునగల నివేదిక ప్రకారమైతే, దేశంలోని ప్రజలు తినే పోషక ఆహారపు నాణ్యత, పరిణామాలు గతంలోకన్నా తగ్గిపోయాయి. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో 81శాతం, పట్టణాలలో 57%మంది అవసరమైన ఆహారాన్ని, పోషక ఆహారాన్ని తీసుకోలేని స్థితిలో వున్నారు. ఎక్కువ తలసరి ఆదాయంఉందన్న రాష్ట్రంలో సహితం ఆకలి సూచిక 13.63 స్థాయిలో(తీవ్రస్థాయి) వుందంటే, యిక యితర రాష్ట్రాల్లో ఎంత తీవ్రంగా వుందో అర్థంచేసుకోవటం కష్టంకాదు. దేశంలో సగంమంది స్త్రీలు సరైన పోషకాహారం లేక రక్తహీనత(పాండురోగం)తో బాధపడుతున్నారు. దేశంలో సగం మందికి పైగా నేటికీ మరుగుదొడ్లూ, పారిశుధ్య సదుపాయాలూలేక అపరిశుభ్రతలో మగ్గుతున్నారు. దేశంలో మానవాభివృద్ధి సగటుస్థాయి 0.467 వుంటే ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాలలో మానవాభివృద్ధిస్థాయి ఆ సగటుస్థాయికన్నా తక్కువగా వుంది. తక్కువ బరువు పిల్లల జననం, పిల్లలు తగినంత బరువులేకపోవటంలాంటి అంశాల్లో మనదేశ పరిస్థితి బ్రిక్,సార్క్ దేశాల్లోని వాటికన్నా అధ్వానంగావుంది. దేశంలోని మొత్తం పేదవారి సంఖ్యలో 60% మంది బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలోనే వున్నారు. దేశంలో పారిశ్రామికంగా తలసరి ఆదాయం అత్యధికంగావున్న గుజరాత్ రాష్ట్రం-ఆకలి, పౌష్టికాహార విషయంలో అత్యంత దారుణంగా వుంది. ఎస్సీ, ఎస్టీ మహిళల్లో పౌష్టికాహారం లోపం దేశమంతటిలోకన్నా, గుజరాత్‌లోనే అత్యధికం. గుజరాత్ రాష్ట్రం గతంలోకన్నా మానవాభివృద్ధి సూచికలో ఒక స్థానం క్రిందకు దిగజారింది. దేశంలో 6-17 ఏళ్ళలోపు పిల్లల్లో 19%మంది బడిబయటనే వుండిపోతున్నారు. పాఠశాలల్లో నాణ్యత, సిబ్బంది కొరత, సదుపాయాలలేమి తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. **(తరువాయి 2వ పేజీలో)**

# భారత్-అమెరికా అణుఒప్పందం-పటాపంచలైన భ్రమలు

**అణునిరాయుధీకరణ** ఒప్పందంపై సంతకం చేయని దేశాలకు, అణుఇంధనాన్ని శుద్ధిచేసే మరియు పునఃప్రక్రియగావించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందచేయరాదని ఇటీవల నెదర్‌లాండ్స్‌లోని నూర్ద్‌విజ్క్‌లో జరిగిన అణుసరఫరా బృంద దేశాల సమావేశం పునరుద్ఘాటించింది. ఈ పునరుద్ఘాటనతో భారత అమెరికా అణుఒప్పందంపై మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వము, భారత పాలకవర్గాలు అణుసాంకేతిక పరిజ్ఞానంపై భారత ప్రజలకు కల్పించిన భ్రమలన్నీ పటాపంచలయ్యాయి. అణుఒప్పందంయొక్క నిజ స్వరూపం బహిర్గతమయింది. ఆ ఒప్పందం ప్రభావం భారతదేశ ప్రయోజనాలకు ఎంత నష్టదాయకమయినదో తేటతెల్లమయింది.

తన అణురియాక్టర్లను అణువాణిజ్యం పేరుతో అమ్ముకోవటానికి ఒప్పందాన్ని ఖరారు చేయించడానికి అమెరికా ఎప్పటినుండో ఒత్తిడి చేస్తోంది. ఈ అణురియాక్టర్ల అమ్మకానికి వెసులుబాటు కల్పించటానికి, మన దేశానికి-దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమయిన పలు నిర్ణయాలను ప్రధాని మన్మోహన్ తీసుకున్నారు. అణురియాక్టర్ల విపణికి భారత దేశపు గేట్లను బార్లాగా తెరిచారు. విదేశీ సంస్థలకు అవకాశమిచ్చారు.

అమెరికా అతిశయోక్తులతోను, మాయమాటల తోను తన అణురియాక్టర్లను అమ్మకానికి పెట్టగా, అన్నీ తెలిసి కూడా ఇచ్ఛాపూర్వకంగా మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం మోసపూరిత ఒప్పందంపై సంతకంచేసి అమెరికా సామ్రాజ్యవాద జట్టులో బేషరతుగా కలిసి పోయింది.

2005 జులైలో మన్‌మోహన్‌సింగ్, బుష్‌ల సంయుక్త ప్రకటనతో అణుప్రపంచంలోనికి భారత ప్రవేశం అనే ప్రహసనం ప్రారంభమయింది.

భారత-అమెరికా అణుఒప్పందం సాఫల్యమయ్యే టందుకు అవసరమైన చర్యలన్నింటినీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అత్యుత్సాహంతో చేపట్టింది. భారత దేశం అణ్వాయుధాలను కలిగివుండటాన్ని, అణుపరిజ్ఞానాన్ని సమాజ ప్రయోజనాలకు ఉపయోగించటాన్ని వేరు చేసింది. తద్వారా భారతదేశపు ద్వంద్వప్రయోజనాల అణుఇంధన పథకాన్ని తుంగలో తొక్కింది. భారతదేశ స్వంత అణురియాక్టర్లను అంతర్జాతీయ రక్షణ నిఘాలోనికి తీసుకువచ్చింది. భారతదేశపు అణుభద్రతను పణంగా పెట్టి అణ్వస్త్ర రహిత దేశపు హోదాను పొందింది. భారత దేశం అణ్వాయుధ సైనిక పాటవంగల శక్తిగా ఎదగకూడదన్న అమెరికా కాంక్షలను ఈ ఒప్పందం పరిపూర్తిచేసింది. ఆయుధాలు తయారుచేయడానికి అనుకూలమైన ప్లుటోనియంపైకాక, యురేనియం ఆధారిత రియాక్టర్లపై ఆధారపడేటట్లు చేసింది.

మరోవైపున 2050 నాటికి 6,55,000 మెగావాట్ల అణుశక్తి ఉత్పాదకత లక్ష్యంగా భారత ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా అణురియాక్టర్లను దిగుమతి చేసుకోవటానికి అనుమతినిచ్చింది. ఆలోచనా రహితంగా అణుఇంధన అవసరాలను అధికంగా చూపించి భారత-అమెరికా అణుఒప్పందం-2008ని ఆమోదించటం ద్వారా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం సురక్షితంకాని విధానాలకు బాటలు వేసింది. అదే సమయంలో అమెరికా అణుఇంధన సరఫరా దేశాలకు భారతదేశంపై ఉన్న ఆంక్షలను తొలగించవలసిందిగా కోరింది. అంతర్జాతీయ అణుఇంధన సంస్థ సందిగ్ధ పథకాలతో ఆంక్షలను ఎత్తివేసినట్లు ప్రకటించింది. ఆవిధంగా హంగు ఆర్భాటాలతో అణుఒప్పందం ఖరారైంది. ఏదో ఒక విధంగా అణుఒప్పందాన్ని అంగీకరింపచేయాలనే ఉద్దేశ్యంతో భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ పూర్తి స్పృహతోనే 'భారతదేశంపై ఆంక్షలను పూర్తిగా ఎత్తివేశారని' పార్లమెంటులో ప్రకటించి పార్లమెంటును, భారత ప్రజలను తప్పుదోవ పట్టించాడు. ఆ విధంగా ఇచ్ఛాపూర్వకమైన స్వయం నియంత్రిత భ్రమతో మన్మోహన్ నిస్సిగ్గుగా భారత-అమెరికా అణు ఒప్పందంలోనికి ప్రవేశించి 150 బిలియన్ డాలర్లకు 40 విదేశీ అణురియాక్టర్లను కొనుగోలు చేశాడు. తద్వారా అమెరికా, ఫ్రాన్స్, రష్యాలలోని అణుపరిశ్రమ నిలద్రొక్కుకోవటానికి, అమెరికా చేతిలోనే భారతదేశం ఉండే అవకాశాన్ని కల్పించాడు.

అణుసరఫరా దేశాల ప్రస్తుత తీర్మానంలో భారత-అమెరికా అణుఒప్పందపు "పూర్తి ఎత్తివేత" ఎంత మోసపూరితమైందో తెలుస్తోంది.

అణుఇంధన రంగాలలో అమెరికా సామ్రాజ్య వాదుల వాణిజ్య, వ్యూహాత్మక ప్రయోజనాలను నెరవేర్చటానికి భారతదేశం అన్ని ప్రయత్నాలనూ చేస్తోంది. అయినప్పటికీ భారతదేశపు త్యాగాలతో అమెరికా సంతృప్తిచెందటంలేదు. భారతదేశపు అణు పరిహార చట్టం సెక్షన్ 17(బి), మరియు సెక్షన్ 46లను రద్దుచేయాలని అది కోరుతోంది. ఎందుకంటే ఆ సెక్షన్లు అణుపరిశ్రమల ప్రమాదాల బాధితులు ఫిర్యాదు చేయటానికి, పరిహారాన్ని కోరటానికి విస్తృతమయిన అవకాశాన్ని ఇస్తున్నాయి కనుక. అంతేకాక భారత-జపాన్‌ల మధ్య పౌర అణుఒప్పందం లేకపోవటంపట్ల కూడా అమెరికా ఆందోళన చెందుతోంది. ఎందుకంటే అమెరికా కంపెనీలయిన జనరల్ ఎలక్ట్రిక్, వెస్టింగ్ హౌస్‌లలో జపాన్ కంపెనీలకు కూడా వాటాలున్నాయి. అందువలన భారత్‌తో వ్యాపారానికి అది అడ్డుగా ఉన్నది. భారత దేశపు అణుపరిహారపు చట్టాన్ని సవరించటానికి లేదా దానిని నిరుపయోగంగా మార్చటానికి, జనరల్ ఎలక్ట్రికల్, వెస్టింగ్‌హౌస్ వంటి కంపెనీలు భారతదేశంలో ప్రవేశించటానికి అనుమతించింది. అణుసరఫరా దేశాలనుండి ఒత్తిడి తేవటం అనే మార్గాన్ని అమెరికా ఎంచుకున్నది. భారత ప్రభుత్వం చెప్పుకొన్నట్లుగా ఆంక్షల పూర్తి ఎత్తివేతకు అనే దానికి అమెరికా కానీ, అణుఇంధన సరఫరా దేశాలు కానీ ఎప్పుడూ హామీ నివ్వలేదు. 2008 నవంబరు నుంచి అణుఇంధన సరఫరా దేశాల ఆంక్షలు ముసాయిదా రూపంలో ఉన్నాయి. అణుఇంధన సరఫరా దేశాలు ఆమోదించాల్సివుంది. అనేకమంది అమెరికా అధికారులు ఇంధన శుద్ధి ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం అణ్వస్త్ర నిరోధ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాలకు అందించటం జరగదని చెప్పారు.

భారత అణుశక్తి సంఘం మాజీ అధ్యక్షులు, భారత అమెరికా పౌర అణుఒప్పందంలో ప్రముఖ పాత్రధారి అయిన అనిల్ కాకోద్కర్ "అణుఇంధన సరఫరా దేశాల ఇటీవలి నిర్ణయం భారత్‌ను లక్ష్యంగా చేసుకొని చేసినది" అన్నారు. "అణుఇంధనాన్ని పునఃచక్రయం చేయటం అనేది ఏదో ఒక దశలో పునఃశుద్ధిచేసే కర్మాగారాలను స్థాపించటానికి, ఉపయోగించిన ఇంధనాన్ని పునః చక్రీయం చేయటానికి దారితీస్తుందని, కాబట్టి మనం యురేనియం శుద్ధి కర్మాగారాలను స్థాపించాలని"అన్నారు. "కానీ అణు సరఫరా దేశాల నిర్ణయం పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది" అన్నారు.

ఇప్పుడు భారతదేశ అధికారులు, అమెరికా ఈ ఒప్పందానికి, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని ఆశపడుతున్నారు. ఇంతవరకు సామ్రాజ్య వాదులు ఇచ్చిన మాటకు కట్టుబడిఉన్న సందర్భమేమీ లేదు.

భారత పాలకులు అణుఇంధన సరఫరా దేశాల ఆంక్షలను గురించి వగస్తూ ఎలా వీటిని అధిగమించాలా అని ప్రార్థిస్తున్నారు. అణుక్లబ్‌లు(బహుళపక్ష ఎగుమతి నియంత్రణ వ్యవస్థలు) ఎన్ఎస్‌జి, ఎంటిసిఆర్, ఆస్ట్రేలియా గ్రూప్ మరియు వాసన్నార్ ఏర్పాటు వంటి వాటిలో చేరతామని ప్రకటిస్తున్నారు. అంతేకాక పోఖ్రాన్ అణుపరీక్ష తరువాత ఇంతవరకు అణుపరీక్షలు జరపకుండా అణ్వస్త్ర నిరోధానికి కట్టుబడి ఉన్న విషయాన్ని గురించి కూడా చెబుతున్నారు. భారత దేశానికి అణుఇంధన శుద్ధి సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సంబంధించిన ఆంక్షలపై అణుఇంధన సరఫరా దేశాలైన అమెరికా, ఫ్రాన్స్ మరియు రష్యా ఈ విషయాలపై నిర్దిష్టమైన ప్రకటనలు ఇవ్వడంలేదు.

భారతదేశం మొదట ఆస్ట్రేలియా గ్రూప్‌తోను తరువాత వాసినార్ గ్రూప్‌తోను దశల వారీగా అణుక్లబ్‌లోకి ప్రవేశించాలని అమెరికా అభిప్రాయ పడుతుండగా, ఒకేసారి నాలుగు క్లబ్‌లలోను సభ్యత్వం ఒక ప్యాకేజీగా పొందాలని భారతదేశం భావిస్తున్నది. అణుప్రమాద పరిహార చెల్లింపులు 300 బిలియన్ డాలర్లకు కుదించాలని దక్షిణమధ్య ఆసియా దేశాల అమెరికా సెక్రటరీ రాబర్ట్ బ్లాక్ భారత్ దేశాన్ని కోరారు. "అణు ప్రమాదాలు సంభవించినపుడు ఇచ్చే పరిహార ఒప్పందంపై సంతృప్తి పరచాలని", "అప్పుడు మేం అంతర్జాతీయ అణుఇంధన సంస్థను ప్రోత్సహిస్తామని, అందుకు భారతదేశం అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా ఒప్పందాలలో భాగస్వామికావాలి" అని అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి హిల్లరి క్లింటన్ భారతదేశ పర్యటనకు వచ్చినపుడు మన ప్రభుత్వానికి సలహా ఇచ్చారు.

వారికి మింగుడుపడని అణుపరిహార చట్టాన్ని రద్దుచేయాలని వారు సూచించారు. అణు సరఫరా దేశాల వాణిజ్య ప్రయోజనాలకు భారత చట్టం వ్యతిరేకంగా ఉన్నది. అనుబంధ పరిహార ఒప్పందానికి అనుగుణంగా భారతదేశం ఒప్పందాలలోనికి రావాలని అణు సరఫరా దేశాలు డిమాండు చేస్తున్నాయి. సామ్రాజ్యవాదానికి ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి విధేయులుగా వున్న భారతపాలకులు, సామ్రాజ్యవాదుల డిమాండ్లను తీర్చటానికి, భారత ప్రజలను మోసంచేయటానికి మరో కొత్త నాటకానికి తెర తీయబోతున్నారనటంలో సందేహం లేదు.

నిలకడైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని నిర్మించనిదే సామ్రాజ్యవాదుల, వారి సేవకులైన దళారీ భారత పాలకులనుంచి ప్రజలు ఈ దేశాన్ని కాపాడు కోలేరు.

D

# విజృంభిస్తున్న హిందుత్వవాద ఫాసిజం

**కాశ్మీర్** సమస్యకు పరిష్కారం సూచించే ప్రయత్నంలో కొందరు ప్రజాస్వామ్యవాదులు, మధ్యవర్తులుగా కాశ్మీర్ లోయలో పర్యటించి, రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలనుంచి అభిప్రాయసేకరణ జరిపి, ఒక నివేదికను కేంద్రహోంమంత్రి చిదంబరానికి సమర్పించిన రోజునే శ్రీరామ్‌సేన అనబడే హిందుత్వవాద ఉన్మాదసంస్థ కార్యకర్తలు, ప్రజాహిత రంగంలోనూ, పౌరహక్కుల రంగంలోనూ చురుకుగా పనిచేస్తున్న ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై, టీ.వీ. కెమెరాల ముందే పాశవికంగా దాడిచేశారు. కాశ్మీర్ విషయంలో ప్రశాంత్ భూషణ్ తాము అంగీకరించని పరిష్కారాన్ని సూచించే వివాదాస్పద వ్యాఖ్యలను 15 రోజుల క్రితం వారణాశిలో చేసినందుకు నిరసనగా తాము ఈ దాడి జరపాల్సివచ్చిందని శ్రీరామ్‌సేన నాయకుడు ఇంద్రవర్మ ప్రకటించాడు. ఇది మతోన్మాదపూరిత ఫాసిస్టుదాడి అంటూ దేశమంతటా ఈ దాడిని వ్యతిరేకిస్తూ నిరసన ఖండనలు వెల్లువెత్తినా వాటిని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా, ఆ మర్నాడే ఢిల్లీ పాటియాలా కోర్టులో ఈ దాడికి కారకులుగా అరెస్టు చేయబడ్డ శ్రీరామ్ సేన అధ్యక్షుడు ఇంద్రవర్మ, భగత్‌సింగ్ క్రాంతిసేన కార్యకర్తలు తేజేంద్రపాల్ బగ్గా, విష్ణుగుప్తాలను విడుదల చేయాలంటూ, ఈ సంస్థల కార్యకర్తలు గుండెలు తీసిన బంట్లలా వ్యవహరించారు. అన్నా హజారే మద్దతుదారులపై దొమ్మీచేశారు. మహిళలపై కూడా దౌర్జన్యం చేశారు. ఇంత జరిగినా బి.జె.పి. మాత్రం ఈ దాడులను శ్రీరామ్‌సేన సంస్థ జరపలేదని, ఎవరో కొందరు వ్యక్తుల దుశ్చర్య మాత్రమే అంటూ వ్యాఖ్యానించింది. ఒకవైపు శ్రీరామ్‌సేన నాయకుడు ఇందర్‌వర్మ తామే ఆ దాడి జరిపామని పరోక్షంగా అంగీకరిస్తూంటే, శ్రీరామ్ సేన సంస్థ కూడా ఈ దాడిని ఖండించింది. మరోవైపు శివసేన నాయకుడు ఉద్ధవ్‌ఠాక్రే ఈ దాడులను సమర్ధించారు.

అధికార మార్పిడి జరిగిన నాటినుండీ మన దేశంలో హిందుత్వవాద మతోన్మాద శక్తులు తమ స్వార్థపర రాజ్యాధికార ప్రయోజనాలకోసం హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, దేశంలో మతవిద్వేషాన్ని అనుక్షణం రెచ్చగొడుతున్నాయి. మెజార్టీ మతస్థులుగా వున్న హిందువులలో అసహనాన్ని పలురూపాల్లో రెచ్చగొడు తున్నాయి. నిర్హేతుకమైన స్వదేశాధిపత్య అభిమానాన్ని ఒక సుగుణంగా పేర్కొంటూ, ఆ దురభిమానాన్ని రెచ్చగొడుతున్నాయి. పాలకవర్గ రాజకీయ పార్టీలు, అధికారంలో వున్న పాలకపార్టీలు, ప్రభుత్వం, రాజ్యం వీరిని కట్టడి చేయటానికి పూనుకోకపోవటంతో, ఈ హిందూ మతోన్మాదశక్తులు తాము పాడిందేపాట, ఆడిందే ఆటగా చలామణి చేసుకోగలిగిన స్థాయికి ఎదిగి పోయాయి. సంఘపరివార్, ఆర్.ఎస్.ఎస్‌ల దర్శకత్వంలో నిర్వహింపబడుతున్న ఈ హిందూత్వవాద మతోన్మాద సంస్థలు సాంస్కృతిక పోలీసు పాత్రను వహిస్తున్నాయి. దేశంలో టెర్రరిస్టు కార్యకలాపాలకూ పాల్పడుతున్నాయి. తమ అభిప్రాయాలనే దేశప్రజలందరూ శిరోధార్యం చేసుకోవాలని ఈ హిందూత్వవాద మతోన్మాద సంస్థలు దౌర్జన్యపూరితంగానూ, దాడులద్వారానూ శాసించే స్థాయికి ఎదిగిపోయాయి. ఈ సంస్థలు తమను అనుసరించటమూ, తమ అభిప్రాయాలను ఆమోదించటం మాత్రమే దేశభక్తి అవుతుందని శాసించే స్థాయికి ఎదిగాయి. ఇదంతా జాతీయత, జాతీయవాదం పేరిట, భారత ప్రజలపై ఈ హిందూమతోన్మాదశక్తులు బలవంతంగా రుద్దుతున్నాయి. తమ ఈ అభిప్రాయాలతో విభేదించే వ్యక్తులు, రచయితలు, కళాకారులు, పండితులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని దౌర్జన్య పూరిత దాడులను జరపటాన్ని ఒక కార్యక్రమంగా పెట్టుకొన్నాయి. అనేక సందర్భాలలో ఈ దౌర్జన్యపూరిత పద్ధతులద్వారా, తమ అభిప్రాయాలకూ, విధానాలకూ, పైచేయిని సాధించటంకూడా జరుగుతోంది.

వేలెంటైన్ డే రోజున మహారాష్ట్రలోనూ, యితర ప్రాంతాలలోనూ పార్కుల్లో, బహిరంగప్రదేశాల్లోనూ ప్రేమికులపై దాడులుజరిపి, వారిచేత బలవంతంగా రాఖీలు కట్టించినది ఈ శ్రీరామ్‌సేనకు చెందినవారే! బెంగుళూరులో పబ్బులుపై దాడిజరిపి అక్కడి యువతీ యువకులను అనాగరికంగా హింసించినదీ ఈ శ్రీరామ్‌సేన కార్యకర్తలే! వీరే ఇటీవల అరుంధతీరాయ్ యొక్క పుస్తకావిష్కరణ సభను భగ్నంచేశారు. కాశ్మీర్ వేర్పాటువాద నాయకులు పాల్గొన్న ఢిల్లీలోని ఒక సెమినార్‌లో గలభా సృష్టించిందీ ఈ సంస్థ కార్యకర్తలే!

ఇదే హిందుత్వవాద శక్తులు యిటీవలి కాలంలో ఢిల్లీలో ఏర్పాటుచేయబడ్డ ఒక మత గ్రంధ ఎగ్జిబిషన్‌ను, ఆ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఆ మత విశ్వాసానికి కట్టుబడినవారు కారంటూ భగ్నంచేశారు. ఈ రకంగా హిందుత్వవాద శక్తులు, ఫాసిస్టుశక్తులుగా ఘనీభవించి, దేశంపై విజృంభించారు.

అయితే యిటువంటి ఫాసిస్టు శక్తులను అదుపుచేసి, కఠినంగా శిక్షించి, వారి ఆటకట్టించాల్సిన ప్రభుత్వాలు, వీరిని చూసీ, చూడనట్లు వదిలివేస్తూ, వీరిని ప్రోత్సహించటం జరుగుతోంది.

ఈ హిందుత్వవాద మతోన్మాదశక్తులు, దేశంలోని మెజార్టీ మతస్థుల ప్రతినిధులుగా చలామణీకావటం, పాలకవర్గ అధికార పార్టీలన్నీ, తమ రాజ్యాధికార సాధనకు, ఈ మెజార్టీ హిందూమత ఓటర్లను ఆకట్టు కోవటానికి ఓటు బ్యాంకు రాజకీయాలను అనుసరించటంవలన ఈ హిందుత్వవాద మతోన్మాద శక్తులు భారత సామాజిక వ్యవస్థలో ఒక మహా వట వృక్షంలా పెరిగిపోయి, ఊడలువేసి పాతుకు పోగలిగిన స్థితికి ఎదగ గలిగారు.

ఇటువంటి దాడులు జరపటంద్వారా రాజకీయ లబ్ధిని పొందటానికి హిందుత్వవాద శక్తులు ఒక అవకాశాన్ని చేసుకొంటే, వారిని కఠినంగా శిక్షించకుండా, అనునయించటంద్వారా రాజకీయ లబ్ధిని పొందేందుకు ఒక అవకాశాన్ని ఏర్పాటు చేసుకొంటోంది, వారి విపక్షంగా ప్రదర్శితమవుతున్న పాలకవర్గ అధికార రాజకీయ పార్టీ కాంగ్రెసు పార్టీ! దీని ఫలితమే నేడు దేశంలో పెరిగిపోతున్న హిందుత్వవాద ఫాసిజం. పాలకులు, ప్రభుత్వం, పాలకపార్టీలూ ఈ హిందుత్వవాద ఫాసిజాన్ని అదుపు చేయపూనుకోకపోవటంతో, అది ఎంతగా పైచేయి సాధించిందనేది, ఈ దాడులు మాత్రమేకాక, ఇటీవలనే జరిగిన మరొక తాజా ఉదంతంకూడా తేటతెల్లం చేస్తోంది.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలో, బి.ఎ. చరిత్ర (ఆనర్స్) కోర్సులో సుప్రసిద్ధ పండితుడు, భాషావేత్తఅయిన కీ.శే.ఎ.కె.రామానుజం రచించిన వ్యాసం "300 రామాయణాలు, ఐదు ఉదాహరణలు తర్జుమాలపై మూడు ఆలోచనలు" పాఠ్యాంశంగా వుంది. భిన్న రామాయణగాథలున్నాయనే చారిత్రక వాస్తవాన్ని సహించని హిందుత్వవాదులు ఆ వ్యాసంపై ధ్వజమెత్తారు. 2008లో విద్యార్థి పరిషత్తు కార్యకర్తలు ఈ వ్యాసంపై వివాదం రేపుతూ, యూనివర్సిటీలోని చరిత్ర విభాగంపై దాడిచేసి, విధ్వంసం జరిపారు. ఈ వ్యాసం మత మనోభావాలను గాయపరుస్తోందంటూ హైకోర్టులో ఓ వ్యాజ్యం దాఖలా చేయబడింది. ఆ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. ఆ వ్యాసంపై నిపుణుల అభిప్రాయాలను తీసుకొని వాటిని అకడమిక్ కౌన్సిలు ముందుంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే నిపుణుల అభిప్రాయాలేమిటో తెల్సుకోకుండానే, అకడమిక్ కౌన్సిలు మెజార్టీ నిర్ణయంపేరిట, ఆ వ్యాసాన్ని పాఠ్యాంశంనుండి తొలగించాలని తీర్మానించింది. ఈ రకంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం లొంగిపోయింది. హిందుత్వవాద శక్తుల సాంస్కృతిక ఫాసిజం పైచేయి సాధించి, ప్రజలపై విధించబడింది.

**(తరువాయి 2వ పేజీలో)**

తమిళనాడు

# కూడంకులం అణువిద్యుత్ కేంద్రనిర్మాణం
# సామ్రాజ్యవాదుల కొమ్ముగాసే పాలకుల విధానాలు-ప్రజల నిరసనాందోళన

**దేశ,** ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన; ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర దుష్ప్రభావం చూపే; పర్యావరణాన్ని కాలుష్యంతో నింపివేసే అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణాలను నిరసిస్తూ ప్రపంచ వ్యాపితంగానూ–ముఖ్యంగా మన దేశంలోనూ వ్యతిరేకత, ఆందోళనలు పెద్దఎత్తున వ్యక్తమౌతున్నాయి. ఈ సంవత్సరం మార్చినెలలో జపాన్ దేశంలో సంభవించిన సునామీ, భూకంపాలకు దైచీ అణువిద్యుత్ కేంద్రంలో సంభవించిన వినాశనం ప్రపంచ ప్రజలను ఉలిక్కిపడేట్లు చేసింది. దీనితో అన్ని దేశాలలోనూ అణువిద్యుత్ వ్యతిరేక నిరసనాందోళనలు తీవ్రమయ్యాయి.

మనదేశంలో–1960లో నిర్మించిన తారాపూర్ అణువిద్యుత్ కేంద్రంతో మొదలుకొని ఇప్పటికి మొత్తంగా ఆరు అణువిద్యుత్ కేంద్రాలలో 20 అణురియాక్టర్ల ద్వారా 4780 మెగావాట్ల విద్యుదుత్పాదన జరుగుతున్నది. ఇంకా, మహారాష్ట్రలోని జైతాపూర్(9900 మె.వా.), హర్యానాలోని గోరఖ్‌పూర్(2800 మె.వా.), గుజరాత్‌లోని మిథివిర్ధి(6000 మె.వా.), మధ్యప్రదేశ్‌లోని ఛుట్కా (1400మె.వా.), ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడ(6000 మె.వా.), తమిళనాడులోని కూడంకులం(9200 మె.వా.) సామర్ధ్యంతో నిర్మించతలపెట్టిన అణువిద్యుత్ కేంద్రాలు నిర్మాణంలో వివిధ దశలలో నుండగా, మరికొన్ని అణువిద్యుత్ కేంద్రాలు ప్రతిపాదనల దశలో వున్నాయి. ప్రజల నిరసన, ఆందోళనల నేపథ్యంలో ఇటీవల పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వం 4800 మె.వా. స్థాపిత స్థామర్ధ్యంతో తూర్పుమిడ్నపూర్ జిల్లా హరిపూర్‌లో నిర్మించ తలపెట్టిన అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దుచేసుకుంటున్నట్లుగా ప్రకటించింది.

ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని కూడంకులం అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా సాగుతున్న నిరసన ఆందోళనలు దేశవ్యాపితంగా ప్రజల దృష్టి నాకర్షిస్తున్నాయి. రష్యా సాంకేతిక పరిజ్ఞానంతో తొలిదశ నిర్మాణం పూర్తిచేసుకున్న తిరునెల్వేలి జిల్లాలోని కూడంకులం అణువిద్యుత్ కేంద్రానికి సంబంధించిన ఒప్పందం భారత–రష్యాల నడుమ 1988లో జరిగింది. తొలుత ఈ విద్యుత్ కేంద్రాన్ని కేరళ తీరంలో నెలకొల్పాలని ప్రయత్నించినా, ప్రజావ్యతిరేకత, ప్రతిఘటనల ఫలితంగా, 2003 నాటికి తమిళనాడుతీరంలోని కూడంకులంలో చివరికి ఖాయం చేశారు.

ఈ అణువిద్యుత్ కేంద్రంపట్ల తమిళనాడులోనూ–ముఖ్యంగా దక్షిణ తమిళనాడులోని తిరునెల్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి జిల్లాల ప్రజానీకం, వివిధ ప్రజాసంఘాలు ఆదినుండీ తమ భయాందోళనలను, వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ వస్తున్నప్పటికీ వాటిని బేఖాతరుచేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అణువిద్యుత్ కేంద్ర తొలిదశ నిర్మాణాలను కొనసాగించి పూర్తిచేశాయి. 13,700 కోట్ల వ్యయఅంచనాతో నిర్మిస్తున్న ఈ అణువిద్యుత్ కేంద్రంలో 1000 మె.వా. సామర్ధ్యంతో రెండు యూనిట్ల నిర్మాణం దాదాపు పూర్తికావస్తున్నది. మరో ఆరు యూనిట్ల నిర్మాణం జరగవలసివుంది. ఈ సంవత్సరం డిసెంబర్‌లో మొదటి యూనిట్‌లో విద్యుదుత్పాదనకు ఎన్.పి.సి.ఎల్. సన్నాహాలలో వుంది.

జపాన్‌లోని ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర విషాద పరిణామాల తర్వాత దేశంలో నిర్మాణంలోవున్న అణువిద్యుత్ కేంద్రాలన్నింటితోపాటు కూడంకులం అణువిద్యుత్ కేంద్ర ప్రాంతంలోనూ మరింత ఆందోళన అధికమైంది. 'అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక పోరాట కమిటీ'గా ఏర్పడిన ఈ ప్రాంత ప్రజానీకం ఆగస్టు 15 నాటికే వివిధ గ్రామసభలు జరిపి, తమ వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ తీర్మానాలుచేసి ప్రభుత్వానికి పంపారు. విజ్ఞప్తులు, ధర్నాలు, నిరసనలు ప్రకటించారు. సెప్టెంబర్‌లో వారి ఆందోళనను తీవ్రంచేశారు. అణువిద్యుత్ కేంద్ర ప్రభావిత ప్రాంతంలోని వివిధ గ్రామాలకు ప్రాతినిధ్యం వహించే 127మంది ఆందోళనకారులు, అణువిద్యుత్ కేంద్రాన్ని శాశ్వతంగా రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ కూడంకులం సమీపంలోని ఇందింతకరాయ్ గ్రామంలో సామూహిక నిరవధిక నిరాహారదీక్ష చేబూని 12రోజులపాటు సాగించారు. ఈ ఆందోళనలు సాగిన కాలమంతటా తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్యాకుమారి జిల్లాలలో విద్యాసంస్థలను బహిష్కరించి విద్యార్థులు ఈ ఆందోళనల్లో భాగస్వాములయ్యారు. ఈ జిల్లాల మత్స్యకారులు తమ జీవనోపాధి అయిన చేపలవేటను ప్రక్కనబెట్టి అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కుల, మతాతీతంగా ప్రజలంతా ఒక్క గొంతుతో ఈ నిర్మాణాన్ని వ్యతిరేకించారు.

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పిసిఐ) ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న కూడంకులం అణువిద్యుత్ కేంద్రాన్ని తమిళనాడు రాష్ట్రంలోని అధికార ఎఐడిఎమ్‌కె, ప్రతిపక్ష డిఎంకె పార్టీలతో సహా ఇతర పాలకవర్గ పార్టీలన్నీ స్వాగతించినవే, సానుకూలంగా వ్యవహరించినవే! తమిళనాడులో అధికారంలోనున్న ఎఐడిఎంకె పార్టీ అధినాయకురాలు జయలలిత–ఈ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణంలో అన్నిరకాలైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నట్లూ; ఈ ప్రాంతం 'భూకంప మండలం–2'లో వున్న కారణంగా భూకంపాలకు గురయ్యే ప్రమాదం లేదనీ, నిశ్చింతగా వుండవచ్చుననీ ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు కూడా! అయినప్పటికీ ఆమె ప్రయత్నాలు ఫలించలేదు, ఆందోళన కొనసాగింది.

ఈ సంవత్సరం అక్టోబర్‌లో తమిళనాడులో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగవలసివుండటం; అధికారపార్టీ అయిన ఏఐడిఎమ్‌కెకు మిత్రపక్షమైన డిఎమ్‌డికె–తన స్వీయ ప్రయోజనాల కారణంగానే అయినప్పటికీ–ఈ ఉద్యమప్రాంత ప్రజలకు మద్దతుగా నిలచివుండటంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలోపెట్టుకొన్న ముఖ్యమంత్రి జయలలిత, తన వైఖరిని మార్చుకున్నట్లుగా ప్రజలను మభ్యపరిచే ప్రయత్నం చేశారు. తదనుగుణంగా ప్రజల భయాందోళనలను తొలగించేంతవరకూ కూడంకులం అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను నిలిపివేస్తున్నట్లుగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. తొలుత కాబినెట్, ఆపై అసెంబ్లీ కూడా ఈ మేరకు తీర్మానం చేయటంతోపాటుగా, ముఖ్యమంత్రి జయలలిత ప్రధానిపై 'లేఖాస్త్రాన్ని' కూడా సంధించారు.

అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించటంతో సరిపెట్టవద్దనీ; నిర్మాణాన్ని శాశ్వతంగా నిలిపివేయాలనీ ఆందోళనకారులు డిమాండ్ చేశారు. తమ రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కనుగుణంగా ఆందోళనను తాత్కాలికంగా విరమింపచేయటంలో అధికార పార్టీ కృతకృత్యురాలైంది.

ఆందోళనకారులతో కూడిన వివిధ ప్రజాసంఘాల, పార్టీల ప్రతినిధిబృందం అక్టోబర్ 7వ తేదీన ప్రధానిని కలిసి అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దుచేయాలనే తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. రానున్న కాలంలో పెరగనున్న విద్యుత్ అవసరాలగురించీ, అణువిద్యుత్ కేంద్రాల భద్రతా ప్రమాణాల గురించీ వివరించిన ప్రధాని, ప్రతినిధి బృందాన్ని సానుకూలంగా ఒప్పించేందుకు విఫల ప్రయత్నం చేశాడు. ఇంతేగాక, స్థానికంగా ప్రజల అపోహలను, భయాందోళనలను తొలగించటంద్వారా అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి ఆటంకాలు లేకుండా చూసేందుకు కేంద్ర సహాయమంత్రి సారధ్యంలోని ఒక నిపుణుల బృందాన్ని ఆఘమేఘాలమీద కూడంకులం పంపాడు కూడా. అణువిద్యుత్‌కేంద్ర నిర్మాణాన్ని రద్దుచేయటమంటే తమిళనాడు అభివృద్ధిని చేజేతులా కుంటుపరుచు కోవటమేనంటూ ప్రధానమంత్రి హెచ్చరించాడు. కాగా, ఆందోళనచేస్తున్న ప్రజల అభిప్రాయాలకే తాను విలువనిస్తానని జయలలిత బదులుఇస్తూ ప్రజాపక్షపాతిగా పోజుపెట్టింది. డిఎంకేతో సహా తమిళనాడులోని ఇతర పాలకవర్గ పార్టీలన్నీ స్థానిక సంస్థల ఎన్నికలలో లబ్ధిపొందే దృష్టితో ఇదే తరహా నాటకమాడాయి.

అణువిద్యుత్ కేంద్ర నిర్మాణంపట్ల కేంద్రప్రభుత్వం నిశ్చయాత్మకంగా వుండటంతో 'పోరాట సమితి' తన ఆందోళనను అక్టోబర్ 9 నుండీ తిరిగి ప్రారంభించి ఉధృతంచేసింది. అక్టోబర్ 13నుండీ కూడంకులం అణువిద్యుత్ కేంద్రంలో పనులనేమీ సాగనివ్వకుండా, బయటనుండి కార్మికులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ఎవ్వరినీ లోనికి వెళ్ళనీయకుండా దిగ్బంధించింది. రోజుల తరబడి ప్రజలు వంతులవారీగా రేయింబవళ్ళూ అణువిద్యుత్ కేంద్రానికి దోవతీసే రోడ్లన్నింటిపై బైఠాయించి ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు.

## ప్రపంచ దేశాల 'వెనకడుగు'– భారత పాలకుల బరితెగింపు

ప్రమాదరహితంగా అణువిద్యుత్ కేంద్రాల నిర్వహణ సాధ్యంకాదనే విషయాన్ని మనదేశంతో సహా వివిధ ప్రపంచదేశాల్లో సంభవించిన ప్రమాదాలు నిర్వివాదంగా రుజువుచేస్తున్నాయి. 1984లో రష్యాలోని చెర్నోబిల్ అణువిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రేలుడులో వేలాదిమంది మృత్యువాతపడగా, దానినుండి వెలువడిన అణుధార్మిక దుష్ఫలితాలను ఆ దేశ ప్రజలు ఈనాటికీ అనుభవిస్తున్నారు. అమెరికాలోని త్రీమైల్ ఐలెండ్‌లో సంభవించిన ప్రమాదంలో పెద్దఎత్తున ప్రాణనష్టం జరగకుండా నివారించగలిగినప్పటికీ, జరిగిన ప్రమాద తీవ్రత, దుష్ఫలితాలూ చిన్నవి కావు. ఆనాటినుండీ మొదలుకొని, ఈ సంవత్సరం ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర విలయం వరకూ అణువిద్యుత్ కేంద్ర ప్రమాదాల జాబితా చాలా పెద్దదే వుంది. వీటి ఫలితంగా ఆనాటికి జరిగే ప్రాణ, ఆస్థి నష్టమేకాక, వాటినుండి వెలువడే అణుధార్మికతతో ఈనాడేకాక రానున్న తరాలుకూడా తీవ్ర దుష్ప్రభావాలు ఎదుర్కోనున్నాయి. ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర వినాశనం అనంతరం అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఎఐఇఏ) నిపుణుల బృందంతో నిర్వహించిన అధ్యయనంలో సునామీలాంటి ఉత్పాతాల్ని సమర్ధంగా కాచుకునే వ్యవస్థ ఇప్పటికింకా ఏర్పాటు కాలేదని తేల్చిచెప్పింది. సునామీ, భూకంపాలవంటి ఉత్పాతాలు సంభవించినపుడు తక్షణ నిర్ణయాలు తీసుకోలేని సంక్లిష్ట అధికార వ్యవస్థలు అవరోధంగా మారాయని తన నివేదికలో పేర్కొంది.

ఫుకిషిమా ఘోర పరిణామాలనంతరం జపాన్, తన దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలన్నింటినీ పునస్సమీక్ష చేయాలని నిర్ణయించింది. 2022 నాటికి జర్మనీ, తన దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలన్నింటినీ మూసివేయాలని; 2034 నాటికి దశలవారీగా సిట్జర్లాండ్ తమ దేశంలోని అణువిద్యుదుత్పత్తిని పూర్తిగా ఆపివేయాలని నిర్ణయించుకోగా, అణువిద్యుత్ కేంద్రాల నిర్వహణపై ఇటలీలో జరిగిన ప్రజాభిప్రాయసేకరణలో ప్రజలంతా వాటి రద్దును కోరుతూ తీర్పునిచ్చారు. ఈ పరిణామాలనంతరం జపాన్ సైతం అణువిద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నది. సెప్టెంబర్ 19న జపాన్ రాజధాని టోక్యోలో 'అణువిద్యుత్తుకు వీడ్కోలు పలకండం'టూ 60వేల మంది పౌరులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ చర్చ ఓ వైపున నడుస్తుండగానే సెప్టెంబర్ 12న ఫ్రాన్స్‌లో తమ దేశానికే చెందిన 'అరెవా' (జైతాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి అణుయంత్ర, పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూరుస్తున్న కంపెనీ) ఆధ్వర్యంలోని న్యూక్లియర్ వ్యర్థాల శుద్ధికర్మాగారంలో ప్రేలుడు సంభవించింది. మృతులకు సంబంధించిన వివరాలు వెలికిరాకున్నా, పేలుడు ఫలితంగా పరిసర ప్రాంతాలను అణుధార్మికత ముంచెత్తింది.

వివిధ రంగాలలో ప్రపంచాన్నే శాసించే అభివృద్ధిని సాధించామంటున్న అమెరికా, రష్యా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాలన్నీ తమతమ దేశాలలోని అణువిద్యుత్ కేంద్రాలలో సంభవించే ప్రమాదాలనే నివారించలేక చేతులెత్తివేస్తూండటాన్ని మనం గమనించవచ్చు. ఆయా దేశాలలో వీటిపట్ల ప్రజలనుండి వ్యక్తమౌతున్న వ్యతిరేకతల కారణంగా అవి తమ దేశాలలోని అణువిద్యుత్ కేంద్రాల మూసివేతలకో, పాక్షిక మూసివేతలకో, పునస్సమీక్షలకో పూనుకుంటూ ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టిసారిస్తున్నాయి. అత్యున్నత శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్నామన్న దేశాలే కల్పించలేని భద్రతను అణువిద్యుత్ కేంద్రాల విషయంలో మన పాలకులు, తాము కల్పిస్తామనటం ప్రగల్భాలాలు పలకటమేకాదు, ప్రజలను నిలువునా వంచించటమే.

వంచనాత్మక కళలో ఆరితేరిన భారత పాలకులు దళారీలుగా వ్యవహరిస్తూ ఆయా దేశాలలో తీవ్రప్రజల వ్యతిరేకతను చూరగొంటున్న అణువిద్యుత్ కేంద్రాలను ఇబ్బడిముబ్బడిగా మన దేశంలో స్థాపించేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటూ ఇదంతా దేశ అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలకోసమేనని నమ్మించే వ్యర్థప్రయత్నం చేస్తున్నారు. వీరి దగాకోరుతనాన్ని ఎత్తిచూపటము, ప్రశ్నించటాన్నే దేశద్రోహంతో జమకడ్తున్నారు.

వాస్తవానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలును వేగవంతం చేసిన భారత పాలకులు గత రెండు దశాబ్దాల కాలంలోనూ వివిధ సామ్రాజ్యవాద దేశాలతో అణు ఒప్పందాలు, అణుఇంధన సరఫరా ఒప్పందాలు చేసుకుంటూవస్తున్నారు. మనదేశంలో నిర్మించే అణువిద్యుత్ కేంద్రాలలో ప్రమాదాలు సంభవిస్తే, ఆయా కేంద్రాలకు అణురియాక్టర్లను సరఫరాచేసిన సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలు పూచీపడకుండా, వాటిని ఆ బాధ్యతలనుండి తప్పిస్తూ వీలుకల్పించే చట్టాలను కూడా భారత పాలకులు చేసుకుంటూ వస్తున్నారు. ఈ ప్రమాదాలు సంభవించినపుడు తమ కంపెనీలను ఏవిధంగానూ జవాబుదారీలేకుండా, పూర్తి స్థాయిలో మినహాయింపులివ్వాలని అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఇంకా పట్టుపడుతున్నాయి.

మనదేశ మొత్తం విద్యుదుత్పత్తిలో 2.7 శాతంగా వున్న అణువిద్యుత్‌ను పెద్దఎత్తున పెంచేందుకు సామ్రాజ్యవాదుల పనుపున భారత పాలకులు పథకాలు సిద్ధంచేశారు. ఆరున్నర లక్షలకోట్ల రూ॥బడ్జెట్టుతో అణు విద్యుత్ యంత్రాల మార్కెట్‌కు గేట్లను బార్లా తెరిచారు. ప్రస్తుతం 4780 మె.వా.గా నున్న అణువిద్యుత్ సామర్థ్యాన్ని 2020 నాటికి 20వేల మెగావాట్లకు; 2032 నాటికి 63వేల మెగావాట్లకు; 2050 నాటికి 6 లక్షల 55వేల మెగావాట్లకు అంచెలంచెలుగా భారీగా పెంచివేయాలనే బృహత్ పథకంతో భారత పాలకులు తమ విధానాలను అమలుచేస్తున్నారు.

కనుక, పాలకుల వంచనాత్మక భ్రమలకు లోనుకాకుండా, దేశప్రజల ప్రయోజనాలకు అత్యంత హానికరమైన, దేశ ప్రజల జీవితాలలో పెనువిషాదాన్ని నింపనున్న, మీదుమిక్కిలి ఈ పేరుతో వ్యూహాత్మకంగా కీలకమైన దేశ తీరప్రాంతాన్ని సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయబోతున్న దళారీ పాలకుల విధానాలపై సమైక్య పోరాటం సాగించాలి. ఇక్కడ మరొక్క విషయంలో స్పష్టంగా వుండాలి. పాలకవర్గ పార్టీలన్నీ తమతమ స్వార్థ, స్వీయ, ఎన్నికల–ఓట్ల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని ప్రజల పక్షాన నిలుస్తున్నట్లూ, ప్రజాభిప్రాయానికి తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లూ పోజుపెడతాయి, నాటకాలాడతాయి తప్ప, వాస్తవ అర్థంలో ఈ పాలక పార్టీలేవీ ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవికావనీ, ఇవన్నీ సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ వర్గాల ప్రయోజనాలకనుగుణంగా వ్యవహరించేవేనన్న అంశాన్ని ప్రజలు, కార్మికులు, కార్మికవర్గ నాయకత్వం ఏమరుపాటునన్నా మరువకూడని విషయం. కూడంకులం అణువిద్యుత్ కేంద్రవ్యతిరేక ఆందోళన సందర్భంగా తమిళనాడులోని అధికార ఏఐడిఎంకె, ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న డిఎంకె తదితర పార్టీల ఆచరణ అంతా దీనినే స్పష్టంచేస్తున్నది.

ఈ పరిస్థితులలో అణువిద్యుత్ వ్యతిరేక ఉద్యమకారులు సామ్రాజ్యవాద దేశాలతో పాలకులు చేసుకున్న అణుఒప్పందాలు, అణుఇంధన సరఫరా ఒప్పందాలను, లొంగుబాటుతో కూడిన అణుప్రమాద బాధ్యతా చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేయాలి. సామ్రాజ్యవాద దేశాల అణుక్షిపణుల తయారీకి అవసరమైన ప్లూటోనియం కొరకు, భారత దేశంలో పెద్దఎత్తున చేబట్టిన యురేనియం తవ్వకాలను వెంటనే ఆపివేయాలని ఉద్యమించాలి. దేశీయ విద్యుత్ విధానాన్ని రూపొందించటంతోపాటు అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణాలన్నింటినీ తక్షణం నిలిపివేయాలనీ; ఇబ్బడి ముబ్బడిగా నిర్మాణం సాగిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల అనుమతులు రద్దుచేయాలనీ; తీరప్రాంత గ్రామీణ పేదలు, మత్స్యకారులు, కార్మికులు దీర్ఘకాల పోరాటానికి సిద్ధంకావాలి. ప్రమాద రహితమైన, మనదేశంలో లభ్యమయ్యే జల, వాయు, సూర్యరశ్మి, గ్యాస్, బయోమాస్ తదితర వనరులపై దృష్టిసారించి విద్యుత్ ఉత్పత్తిని ప్రధానంగా పెంచుకోవాలని, ఉత్పత్తయిన విద్యుత్తును కూడా వ్యవసాయరంగానికి, ప్రజావసరాలకు, దేశీయ పారిశ్రామిక అవసరాల ప్రాధాన్యతాక్రమంలో అందించాలని డిమాండ్‌చేస్తూ ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, జాతీయ, దేశభక్తియుత శక్తులు ఉద్యమించాలి.

D

చదవండి!
అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు
సామ్రాజ్యవాదుల కుట్రలు
వెల : 15/-
కాపీలకు :
మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# కరవు కోరల్లో రైతాంగం
# సహాయ చర్యల అమలులో ప్రభుత్వ ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం

**రాష్ట్రంలో** కరువు తీవ్రరూపం దాల్చింది. అన్నదాతలు అల్లాడుతున్నారు. సాగునీటి సౌకర్యంలేక, వర్షాలు కురవక, కరెంటు కోతతో పైరుకి నీరుఅందక భూమి నెర్రెలు విచ్చి కొద్దికాలంలో చేతికందాల్సిన పంటపైరు కళ్ళముందే ఎండిపోతుంటే రైతుల గుండెలు ఎప్పుడు ఆగిపోతాయోనన్న విధంగా పరిస్థితులు దిగజారాయి. రాష్ట్రవ్యాపితంగా 39 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవటమేకాకుండా, పశువుల మేతకు, మంచినీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడింది. కరువు కాటు ఉరకలుపరుగులతో ముంచెత్తుతుంటే, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. సహాయక చర్యల అమలులో పూర్తిగా విఫలమైంది.

ప్రభుత్వ విధానాల ఫలితంగా సేద్యం సంక్షోభంలో పడి రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తరతరాలుగా భూమినే నమ్ముకున్న రైతాంగం సేద్యాన్ని వదులుకోలేక అనేక అవస్థలుపడి, దాన్ని కొనసాగిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక ధరలు పెరుగుతూ వుండటంవలన సేద్యపు ఖర్చు మోయలేని భారంగా రైతాంగానికి తయారైంది. నేడు సేద్యానికి ఎకరాకు కనీసం 20వేలదాకా ఖర్చు అవుతున్నది. కౌలురైతులు అయితే మరో 20వేలు అదనంగా పెట్టుబడి పెట్టాలి. కౌలురైతులతోపాటు అనేకమంది రైతులకు బ్యాంకులనుండి పంటరుణాలు అందకపోవటంవలన ప్రైవేటు వడ్డీవ్యాపారులవద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సేద్యం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంభవించిన పంట నష్టం రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, బయటపడలేని స్థితి ఏర్పడింది.

కరువుకు కారణాన్ని ప్రకృతిపై నెట్టివేస్తూన్న పాలకులు, దాని నివారణకు కావలసిన చర్యలను రూపొందించటంలోనూ, అమలుచేయటంలోనూ ఘోర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వ్యవసాయరంగం ఎడల స్వతంత్రవిధానం అనుసరించకుండా ప్రపంచబ్యాంకు షరతులకు అనుగుణమైన విధానాలను ప్రభుత్వం అమలు జరుపుతున్నది. అందువలనే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని నష్టాలను తగ్గించే విధానాలను ప్రభుత్వం చేపట్టలేదు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతున్నాయని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ విషయం ప్రభుత్వానికి తెలియంది కాదు. అయినా అలాంటి పరిస్థితిని ఎదుర్కోవటానికి ఎటువంటి జాగ్రత్తలూ చేపట్టటంలేదు. రాష్ట్రంలోని నదీజలాలను, వర్షపునీటిని నిల్వచేసే ఆనకట్టలు, బ్యారేజీలు, చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మించటంలో ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం వహించిన ఫలితంగా ప్రతిసంవత్సరం 3వేల టి.యం.సి.ల నీరు సముద్రం పాలౌతున్నది. ఆ నీటిని నిల్వచేసి ఉంటే వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా సమర్ధవంతంగా ఎదుర్కొనే అవకాశం వుండేది. రైతాంగం ఈ విధంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉండేది కాదు.

వాస్తవానికి కరువు పరిస్థితులను ప్రభుత్వమే కొనసాగిస్తున్నది. కొన్ని ప్రాంతాలను ఉద్దేశపూర్వకంగానే కరువు పీడిత ప్రాంతాలుగా మిగిల్చి, ఈ ప్రాంతాలనుండి బడా పరిశ్రమాధిపతులకు కారుచౌకగా కూలీలు అందే విధంగా గ్రామీణ ప్రజలు వలసబాటపట్టే విధానాలను అమలుజరుపుతున్నది. అందుకే ఆ ప్రాంతాలు నిత్యకరువు పీడిత ప్రాంతాలుగా 'విరాజిల్లు'తున్నాయి.

## పంట నష్టం

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లోనే అనేక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి దాదాపు 17 లక్షల ఎకరాల్లో సేద్యమే చేయలేదు. వేసిన పంటలు కూడా లక్షలాది ఎకరాల్లో ఎండిపోయాయి. దీనికితోడు గత రెండు నెలలుగా వర్షాలు కనుమరుగవటంవలన రాష్ట్రంలోని గ్రామీణప్రాంతం దుర్భిక్షంగా మారి కరువు పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా పంటలు కోల్పోయిన రైతాంగం, ఉపాధి దొరకని గ్రామీణ పేదలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికి ప్రభుత్వాధికారుల లెక్కల ప్రకారం వరి దాదాపు మూడులక్షలు, వేరుశనగ 18,65,000, ప్రత్తి 7,05,249, ఆముదం 3,49,585, మొక్కజొన్న 1,92,195, ప్రొద్దుతిరుగుడు 16వేలు, కంది 1,70,512, జొన్న 2,210, చెరకు 8,587, సజ్జ 12,802, కొర్రలు 16,230, పెసర-మినుము 500, జనుము 3,760 ఎకరాలతోపాటు, ఇంకా అనేకపంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 39 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు, ఇది మొత్తం పంటలో 19%పైగా ఉన్నట్లు రాష్ట్రప్రభుత్వమే ప్రకటించింది. ఇంతకన్నా ఎక్కువగా నష్టం జరిగినట్లు వార్తలు తెలియజేస్తున్నాయి.

## కరువు మండలాలు

రాష్ట్రంలో ఏర్పడిన తీవ్రవర్షాభావ పరిస్థితులవలన కరువు తీవ్రరూపందాల్చినా, దాన్ని ఎదుర్కోవటానికి ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రైతుల ఆర్తనాదాలు పాలకుల చెవికెక్కటంలేదు. వారిని ఆదుకొనే చర్యలు తీసుకోలేదు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై అన్నివైపులనుండి విమర్శలు వెల్లువెత్తటం, రైతాంగంలో తీవ్ర అసంతృప్తితోపాటు, కరువు మండలాలను ప్రకటించాలనే డిమాండ్ తీవ్రంగా ముందుకు రావటంతో, కరువు పరిస్థితులను అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకొంటానని ప్రభుత్వం ప్రకటించక తప్పలేదు. కరువు మండలాలపైన, కరువు పరిస్థితిపైన నివేదిక పంపాలని కలెక్టర్లను కోరింది. కలెక్టర్లు పంపిన నివేదికల ప్రకారం వివిధ జిల్లాల్లో కరువు మండలాలు ఈవిధంగా వున్నాయి.

కరువు పరిస్థితులపై కలెక్టర్ల నివేదికలను పరిశీలిస్తే నాలుగైదు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లోను కరువు మండలాలు ఉన్నాయి. క్రమంగా కరువు మండలాల సంఖ్య పెరుగుతూవస్తున్నది. కరువు పరిస్థితిపై కలెక్టర్ల నివేదిక కోరటంలోనే పెద్ద జాప్యం జరగగా, వారి నివేదిక అందిన తర్వాత కూడా కరువు మండలాల నోటిఫికేషన్ జారీచేయటంలోనూ ప్రభుత్వం కాలయాపన చేసింది. చివరకు 456 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ విధంగా కలెక్టర్ల ప్రతిపాదనలకు కూడా కోత విధించింది. (పట్టిక గమనించండి)

## పనికిరాని నిబంధనలు

కరువు పరిస్థితిని నిర్ధారించటానికి రూపొందించిన విధానం లోపభూయిష్టంగా ఉంది. ఒక నెలలో పడవలసిన వర్షం ఒక్కరోజులో కురిసి, తర్వాత వర్షాలు పడకపోయినా ఆ ప్రాంతంలో సాధారణ వర్షపాతం నమోదైై వర్షాభావ పరిస్థితిలేనట్టుగానే అందుకు సంబంధించిన అధికారులు ప్రకటిస్తారు. ఇలాంటి లెక్కలు వర్షాభావ పరిస్థితిని సరిగా అంచనా వేయవు. ఒకటి, రెండురోజులు వర్షం కురిసి, మిగతారోజుల్లో వర్షం లేకపోవటంవలన ఆ వర్షం వలన పంటలకు నీరందక, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలంటే 50% కంటే ఎక్కువ పంట నష్ట పోయినట్లుగా ప్రభుత్వాధికారులు నిర్ధారిస్తేనే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. యాభైశాతం కన్నా ఒక్కశాతం నష్టం తగ్గినా నష్టపోయిన రైతులకు ఎటువంటి పరిహారం అందదు. ఇలాంటి పరిహారం కూడా గ్రామయూనిట్‌గా ఒక పంటకే వర్తిస్తుంది. మిగతా పంటలకు మండల యూనిట్ పరిధిలోకి వర్తిస్తుంది. ఇలాంటి నిబంధనల వలన పంట నష్టపోయిన రైతాంగానికి ఎటువంటి పరిహారం అందటంలేదు. ఇలాంటి విధానమే పంటల బీమా పథకానికి వర్తింపచేయటంవలన అత్యధిక రైతులకు ఆ పరిహారం అందకుండా పోతున్నది. కరువు పరిస్థితి నిర్ధారణకు వాస్తవ పరిస్థితుల ప్రాతిపదికపై విచారిస్తే ఇంకా ఎన్నో మండలాలు కరువు మండలాలుగా ప్రకటించవలసివస్తుంది.

ఇక, కరువు బారినపడ్డ రైతులకు సక్రమమైన సహాయం అందించే చర్యలను ప్రభుత్వం తీసుకోకుండా రైతాంగాన్ని పక్కదారి పట్టించేందుకు, వారి సమస్యలకు కారణమైన తన విధానాలను మరుగుపర్చేందుకు రైతుల, కూలీల మధ్య వైరుధ్యాన్ని సృష్టించేందుకు పూనుకొంటున్నది. గ్రామీణ ఉపాధి హామీ పథకంవలన వ్యవసాయానికి నష్టం జరుగుతున్నదని ఉపముఖ్యమంత్రి ప్రకటించటమే అందుకు నిదర్శనం. ఉపాధి హామీ పథకం వలన తక్కువ కూలికి కూలీలు దొరకక వ్యవసాయం సంక్షోభంలోపడి భూస్వాములు, ధనికరైతులు నష్టపోతున్నారన్నదే ఉపముఖ్యమంత్రిగారి ఉవాచ. ఈయనకి భూస్వాముల, ధనికరైతుల ఎడల ఎంత ప్రేమ?! గ్రామీణ ఉపాధిపథకం తమ పార్టీ నాయకత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం ప్రవేశపెట్టిందనేది ఉపముఖ్య మంత్రిగారు మర్చిపోయినట్లు ఉన్నారు. ఉపాధి లభించని గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించటమే ఈ పథకం లక్ష్యంగా యుపిఏ ప్రకటించిందన్న విషయం ఈయన మర్చిపోయి అందుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. ఆచరణలో ఈ పథకం పూర్తిగా విఫలమైందన్న విషయం ఆయనకూ తెలుసు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు వ్యవసాయ కూలీలు కారణం కాదన్నది, నూటికి 90%పైగా కూలీలు వ్యవసాయ పనుల్లోనే పాల్గొంటున్నారన్నది అనేక సర్వేలు వెల్లడించిన వాస్తవాన్ని ఉపముఖ్యమంత్రి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఉపముఖ్యమంత్రి మాటలు ఉద్దేశపూర్వకంగా వచ్చినవే. వ్యవసాయ పనులను ఉపాధి పథకంపనుల్లో చేర్చి భూస్వాములకు, ధనికరైతులకు తక్కువకూలి రేట్లతో కూలీలు వెళ్ళే విధంగా చేయటంతోపాటు, యంత్రాల వినియోగం ఎక్కువచేసి, కూలీల ఉపాధిని హరించటంతో పాటు, వ్యవసాయ ఖర్చులు పెంచి రైతాంగానికి గిట్టుబాటుగాని పరిస్థితికల్పించి, వ్యవసాయం దండగన్న ఉద్దేశం రైతుల్లో కల్పించి, వారి భూములను కాంట్రాక్టు-కార్పోరేట్ సంస్థలకు లీజుకివ్వటమో, అమ్మివేయటమో చేసే పరిస్థితి కల్పించి, ఆ కంపెనీలవద్ద చిన్న, సన్నకారు రైతులను-కూలీలుగా మార్చటమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకొన్నది. అందులో భాగమే ఉపముఖ్యమంత్రి ప్రకటనన్నది గమనించాలి.

## వలసలు

రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులవలన సాగునీరులేక పంటలు ఎండిపోవటంతోపాటు తాగటానికి మంచినీరు సమస్యగా మారింది. పశువులకు నీరు, మేత దొరకక అల్లాడుతున్నాయి. పశుపోషణ చేయలేక బరువెక్కిన హృదయంతో వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఉపాధిపనులు, కరువు తాండవించటంతో హరించుకు పోయి గ్రామీణ పేదలకు ఉపాధి సమస్య తీవ్రరూపం దాల్చింది. బ్రతుకు తెరువుకోసం ఉపాధిని వెతుక్కొంటూ వలసబాట పడుతున్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో పడటంతో దాని అనుబంధ రంగాలు కుప్పకూలు తున్నాయి. ఉపాధికోసం వలసలు ఎక్కువ అవటంతో గ్రామాలకు గ్రామాలే ఖాళీఅవుతున్న హృదయవిదారక దృశ్యాలు, వలస ప్రజలతో కిటకిటలాడుతున్న బస్సు, రైల్వేస్టేషన్లు కళ్ళముందు ప్రత్యక్షమౌతున్నాయి.

**మహబూబ్‌నగర్‌జిల్లా** - పాలమూరు వలసలకు నిలయంగా మారింది. జిల్లానుండి ప్రతిసంవత్సరం 10 లక్షలమంది వలసపోతున్నారు. దేశంలో నిర్మాణ భవంతులు ఎక్కడ కూలినా పాలమూరు నుంచే రోదనలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, హర్యానా తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పొట్టచేతపట్టుకొని వలసవెళ్తున్నారు. ప్రస్తుత కరువు పరిస్థితి వలసలను మరింతగా పెంచింది. మహబూబ్‌నగర్‌నుండి ముంబై వెళ్ళే బస్సులు కేవలం వలసకూలీలను తీసుకెళ్లేందుకే ఉండటం గమనించవలసిన విషయం.

**కర్నూలుజిల్లాలో** కరువు పరిస్థితులవలన ఉపాధి దొరకక, ఇతర ప్రాంతాలకు జిల్లానుండి పెద్దఎత్తున వలసలు కొనసాగుతున్నాయి. వేలాదిమంది గ్రామీణ పేదల వలసలవలన గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవు తున్నాయి. **అనంతపురంజిల్లాలో** ఏర్పడిన తీవ్ర కరువు వలన ఈ సంవత్సరం నామమాత్రంగా కూడా పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు లేక వ్యవసాయ పనులు లేక ఉపాధికోసం ఈజిల్లానుండి 2.50 లక్షలమంది గ్రామీణ పేదలు బెంగుళూరు, హైద్రాబాద్, పూణె, ముంబై వంటి ప్రాంతాలకు వలసలు వెళ్ళారు. జిల్లాలోని మడకశిర, రాప్తాడు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కదిరి, పుట్టపర్తి, పెనుగొండ, ధర్మవరం నియోజక వర్గాల్లో అధికశాతం పల్లెగ్రామాలు ఖాళీఅయ్యాయి. **విశాఖజిల్లా**లోని చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, చడికాడ, కోలుగుంట, కె.కోటపాడు, మాడుగుల, నర్సీపట్నం, నాతవరం, కోటవురట్లు, నక్కపల్లి, ఎస్.రామవరం, రాంబల్లి, మాకవరపాలెం, యలమంచిలి, పాయకారావుపేట మండలాలనుండి 20వేల కుటుంబాలు వలసలు వెళ్లటంతో పల్లెలన్నీ బోసిపోయివున్నాయి. **చిత్తూరుజిల్లాలో** 2004 ముందునాటి పరిస్థితులు పునరావృతమైనాయి. మదనపల్లి, రామసముద్రం, నిమ్మనపల్లె, కేవీపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, తంబళ్ళపల్లె, గూడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, బి.కొత్తకోట తదితర మండలాలకు చెందిన వందలాది కుటుంబాలు వలసబాట పట్టాయి. ఎక్కువగా బెంగుళూరుకు వలసవెళ్ళారు. **తూర్పుగోదావరిజిల్లా** సేద్యపరంగా ఎప్పుడూలేని దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ప్రతి సంవత్సరం వ్యవసాయ కూలీలకు

| జిల్లా | మొత్తం మండలాలు | ప్రతిపాదిత కరువు మండలాలు |
|---|---|---|
| శ్రీకాకుళం | 51 | 26 |
| వరంగల్ | 51 | 25 |
| నల్గొండ | 59 | 42 |
| అనంతపురం | 63 | 63 |
| కడప | 50 | 14 |
| కర్నూలు | 54 | 22 |
| చిత్తూరు | 66 | 66 |
| రంగారెడ్డి | 33 | 28 |
| విజయనగరం | 34 | 30 |
| కరీంనగర్ | 57 | 52 |
| ఖమ్మం | 46 | 31 |
| మెదక్ | 46 | 43 |
| మహబూబ్‌నగర్ | 64 | 35 |
| గుంటూరు | 57 | 11 |
| ఆదిలాబాద్ | 52 | 22 |
| పశ్చిమగోదావరి | 46 | 08 |
| ప్రకాశం | 56 | 50 |
| నెల్లూరు | 46 | 33 |
| మొత్తం | 930 | 601 |

ఎక్కువగా ఉపాధిని కల్పించే కోనసీమలో రైతాంగం క్రాప్‌హాలిడే ప్రకటించడంతో ఉపాధి కరువై వేలాదిమంది వలసబాట పట్టారు. మంత్రి తోట నరసింహులు నియోజకవర్గంలోనే మూడువేలమంది ప్రజలు వలస వెళ్లారు. **విజయనగరంజిల్లా**లోని కొమరాడ, గుమ్మ లక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, పార్వతీపురం, మక్కువ, గరుగుబిల్లి, బలిజపేట, బొబ్బిలి, పాచిపెంట, రామచంద్రాపురం, తెర్లాం, మెంటాడ మండలాల్లో వర్షాభావ పరిస్థితులవలన పనులు దొరకక గ్రామీణ పేదలు పెద్దఎత్తున వలసలు పోతున్నారు. **శ్రీకాకుళం** జిల్లాలో మైదానం, ఏజన్సీ అనే తేడాలేకుండా వలసలు కొనసాగుతున్నాయి. పాలకొండ, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజక వర్గాలనుండి వలసలు ఎక్కువగా వున్నాయి. ముంబై, చెన్నై, హైద్రాబాద్, జగదల్‌పూర్, రాయపూర్, భువనేశ్వర్, కాండ్లా, కిరోండల్, అండమాన్ తదితర ప్రాంతాలకు జిల్లానుండి వలసలు ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఇంకా కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలనుండి కూడా వలసలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి.

## రైతుల ఆత్మహత్యలు

కరువు, వరదలు, చీడపీడలు లాంటి ప్రకృతి వైపరీత్యాలవలన జరుగుతున్న పంట నష్టంతోను, ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల ధరలు పెరుగుదలవలన, పంటలకు గిట్టుబాటు ధరలు లభించక పోవటంవలన రైతాంగం నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయి దాన్నుండి బయటపడలేక వేలాది మంది రైతాంగం ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకొన్నారు. రైతుల ఆత్మహత్యలను తెలుగుదేశం-కాంగ్రెస్ ప్రభుత్వాలు అపహాస్యం చేశాయి. ప్రస్తుతం ఏర్పడిన అనావృష్టి వలన పంటలు నష్టపోయి మరింతగా అప్పుల ఊబిలో రైతాంగం కూరుకుపోయారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండటం, ఉన్న ఆస్తులు అమ్మినా తీరే పరిస్థితి కన్పించకపోవటం, బ్యాంక్ అధికారుల, వడ్డీవ్యాపారుల వేధింపులు, అవమానాలు కళ్ళముందు కదలాడుతూ ఉండటంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతూ వస్తున్నాయి. పంటనష్టపోయి బ్రతుకు మార్గం కానరాక గుండెపోటుకు గురై కూడా రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. గత మూడు నెలల కాలంలో కరీంనగర్, అనంతపురం, కర్నూలు, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, తూర్పుగోదావరి, నల్గొండ, మెదక్, వరంగల్, కడప, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఆత్మహత్యలు చేసుకొని, గుండె పోటుకి గురై 200 వందలకుపైగా రైతులు ప్రాణాలు కోల్పోయారంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమౌతుంది. ఈ ఆత్మహత్యల పరంపర ప్రతిరోజూ కొనసాగుతూనేవుంది.

## సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి

ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన కరువుకి, రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. కరువు పరిస్థితులనుండి రైతులను, గ్రామీణ పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. ఆ

(తరువాయి 6వ పేజీలో)

# జన్యుమార్పిడి పంటల పరిశోధనా క్షేత్రంగా మలచబడ్డ భారతదేశం

**సామ్రాజ్యవాద** ప్రపంచీకరణను మనదేశంలో అమలుజరుపుతున్న పాలకులు, మన దేశానికి ఎన్నో అనర్థాలను కొని తెచ్చిపెట్టారు. అటువంటి వాటిలో ఒక ముఖ్యమయిన అనర్థం జన్యుమార్పిడి పంటలు.

దేశంలోని దారిద్ర్యాన్ని పారదోలటంకోసం, నిరంతరం పెరుగుతున్న జనాభాకు అవసరమయిన ఆహారాన్ని సమకూర్చటం అన్న సాకుతో ఈ జన్యుమార్పిడి పంటల అనర్థాన్ని మన పాలకులు దేశంలోకి కొనితెచ్చారు.

జన్యుమార్పిడి పంటల సాంకేతికతకు అమెరికా దేశం పుట్టినిల్లు. ఈ సాంకేతికత ద్వారా ప్రపంచ మంతటాగల ఆహార సమస్యను తీర్చవచ్చును అనే అబద్ధపు ప్రచారంతో సామ్రాజ్యవాద అమెరికా ఈ అనర్థాన్ని మనదేశంతోపాటు ప్రపంచంలోని పలు యితర దేశాలకు అమ్మింది. అమెరికాకు చెందిన బడా ట్రాన్స్‌నేషనల్ విత్తన కార్పొరేషన్లయిన మోన్సాంటో, డ్యూపాంట్, సింజెంటా కార్పొరేషన్లకు ప్రపంచమంతటా, జన్యుమార్పిడి విత్తనాల మార్కెట్టును సామ్రాజ్యవాద అమెరికా ఏర్పాటు చేసిపెట్టింది. ప్రస్తుతం ప్రపంచమంతటి విత్తనాల మార్కెట్టులో 70శాతాన్ని ఈ మూడు కంపెనీలే నియంత్రిస్తున్నాయి. మోన్సాంటో కంపెనీ భారత దేశంలోని ప్రత్తి విత్తనాల మార్కెట్టులో 95% భాగంపై నియంత్రణను సాధించి, అనూహ్యంగా ధరలను పెంచివేస్తూ రైతుల జీవితాలతో చెలగాటమాడుతోంది. గత 15 సంవత్సరాలుగా 2,50,000 మంది భారత దేశంలోని రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకొన్నారన్న వాస్తవాన్ని గమనిస్తే, ఈ విత్తనాల ధరల పెంపుదలవలన ఎందరో రైతులు అప్పులు పాలయి ఆత్మహత్యల పాల్పడ్డారని విశదమవుతుంది. ఈ జన్యుమార్పిడి కంపెనీలు తమ విత్తనాలను అమ్ముకోవటంకోసం, రైతులు సాంప్రదాయకంగా వాడుకొనే విత్తనాలను అనేక కుయుక్తులతో రైతులకు అందుబాటులో లేకుండా ఉపసంహరింపజేశాయి. ప్రభుత్వాలపై బలమైన లాబీయింగ్ చేయటంద్వారా, స్థానిక విత్తనాల కంపెనీలను తామే కొనుగోలు చేసుకోవటంద్వారా ఈ జన్యుమార్పిడి విత్తనాల కార్పొరేషన్లు విత్తన మార్కెట్టుపై తమ ఆధిపత్యాన్ని సాధించాయి.

జన్యుమార్పిడి విత్తనాలను వాడటంవలన రైతుల ఉత్పత్తి వ్యయం తరుగుతుందనీ, రసాయనిక పురుగుల మందులపై, కలుపును చంపే మందులపై భారీ ఎత్తున వ్యయంచేస్తున్న రైతులు జన్యుమార్పిడి విత్తనాలు వాడితే ఆ వ్యయాన్ని పూర్తిగా తగ్గించుకోవచ్చుననీ, అధిక దిగుబడులు సాధించుకోవచ్చుననీ-ఈ కంపెనీలు అబద్ధపు ప్రచారాన్నిగావించి, రైతులను ఆకర్షించాయి. తమ అదుపులో, ప్రలోభంలో వుంచుకొన్న శాస్త్రజ్ఞులద్వారా, తాము ఏర్పాటుచేసిన మధ్యవర్తి సంస్థలద్వారా యిటువంటి అబద్ధపు ప్రచారం చేయించాయి.

తీరా అనుభవంలోచూస్తే, యివన్నీ అబద్ధాలని తేలిపోయాయి. ఆచరణలో ఈ జి.ఎం. విత్తనాలను వాడటంవలన అధిక దిగుబడులు రాకపోగా, రైతులు మరింతగా కృత్రిమ రసాయనిక పురుగుల మందులనూ, కలుపు మొక్కల నివారణ మందులనూ వాడవల్సి వస్తోందని తేలింది.

చైనాలో జన్యుమార్పిడి ప్రత్తి విత్తనాలను విస్తారంగా నాటడం జరిగింది. 1997నుండి యిప్పటివరకూ, విస్తారంగా జన్యుమార్పిడి ప్రత్తివిత్తనాలను నాటడం మూలంగా పురుగులమందు వాడకం తగ్గకపోగా, 12 రెట్లు పెరిగిందని "ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బయో టెక్నాలజీ" అనే పత్రిక వెల్లడించింది. జన్యుమార్పిడి విత్తనాలవలన ఏమేరకయినా ప్రయోజనం ఉందను కొంటే, ఆ ప్రయోజనం పెరిగినపురుగుల మందుల వాడక అవసరంతో రద్దయిందని ఆ పత్రిక వెల్లడించింది.

అదేవిధంగా అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలలోని జన్యుమార్పిడి సోయాపంటను పండించే రైతులు, తాము పండించే సాంప్రదాయక పంటలకు వాడే కలుపు నిరోధక మందులకు రెట్టింపు కలుపు నిరోధకమందులు ఈ జన్యుమార్పిడి పంటలకోసం వాడవలసివచ్చింది.

భారతదేశంలోని జన్యుమార్పిడి ప్రత్తి పండించే రైతులు గతంలో కంటే 13 రెట్లు అధికంగా పురుగుల మందులను వాడవలసివస్తోంది.

జన్యుమార్పిడి పంటలపై వాడటానికని జన్యుమార్పిడి విత్తనాల కంపెనీలు యిచ్చే పురుగుల మందులకు, కలుపు నిరోధక మందులకు కలుపు మొక్కలు అలవాటుపడి, ఆ మందులు పనిచేయకుండా రెసిస్టెన్సును పెంచుకోవటంతో, ప్రస్తుతం సరిక్రొత్త "సూపర్ కలుపు మొక్కలు" పుట్టుకొచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి.

ఈ "సూపర్ కలుపు మొక్కల" బెడద ప్రస్తుతం అమెరికాలో పుట్టుకొచ్చి, అమెరికాలోని 22 రాష్ట్రాలలోని 6 మిలియన్ల హెక్టార్లలో వేయబడిన సోయా, జొన్న, ప్రత్తి పంటలను నాశనం చేస్తోంది.

ఈ రోజున 29 దేశాల్లో 1.5 బిలియన్ల ఎకరాల్లో ఈ జన్యుమార్పిడి పంటలు పండించబడుతున్నాయి. ఈ జన్యుమార్పిడి పంటలు ఆహార సంక్షోభానికీ, వాతావరణ మార్పులకు, భూమికొరతలకు పరిష్కారమన్న ప్రచారంతో, ఆ జన్యుమార్పిడి సాంకేతికత-విత్తనాల అమ్మకం జరిగింది. కానీ ఆచరణలో, అనుభవంలో యిదంతా అబద్ధమని తేలింది.

ఈ జన్యుమార్పిడి విత్తనాలను అమ్ముతున్న బడాకార్పొరేషన్లు, శాస్త్రజ్ఞులను కూడా ప్రలోభపెట్టో, భయపెట్టో తమ అదుపులో వుంచుకొని వాటికి వ్యతిరేకంగా మాట్లాడకుండా నియంత్రిస్తున్నాయి. ఆ కార్పొరేషన్లు తమకు వ్యతిరేకంగా మాట్లాడే శాస్త్రజ్ఞులపై, తమ అదుపులోవున్న సుస్థాపితమైన సంస్థలద్వారా (వీటికి ఆ కంపెనీలే గ్రాంట్లు యిస్తున్నాయి) దాడిచేయించి నోర్మూయిస్తున్నాయి. అందువలన ఈ జన్యుమార్పిడి విత్తనాలవలన ఏర్పడే అనర్థాలగురించిన వివరాలు రైతాంగానికి చేరటల్లేదు.

ఈ జన్యుమార్పిడి విత్తనాలవలన పర్యావరణ ప్రమాదాలు, మానవుల ఆరోగ్య ప్రమాదాలు, ఆర్థిక నష్టాలు సంభవిస్తాయని శాస్త్రజ్ఞులు మొత్తుకొంటూనే వున్నారు. జన్యుమార్పిడి ప్రత్తిపంటను మేతవేసిన పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం, పాలు యిచ్చే సామర్థ్యాలు తరిగిపోతున్నాయని హెచ్చరిస్తున్నారు.

ఈ జన్యుమార్పిడి పంటలు ఆహార భద్రతను చేకూర్చకపోగా, ఆహార అభద్రతనే పెంచుతున్నాయని శాస్త్రజ్ఞులు సోదాహరణంగా తెలియచేస్తున్నారు. ఈ జన్యుమార్పిడి పంటలు ఎక్కువ మేరకు బయోఇంధనం ఉత్పత్తికోసమే పండింపబడుతున్నాయనీ, అందుకు జరిగే భారీ భూవినియోగంవలన, స్థానిక ఆహార అవసరాలు తీరటానికి అవసరమయిన పంటలు పండించేందుకు కావల్సిన పంట భూమి అందుబాటులోకి లేకుండా పోతోందని వారు తెలియచేస్తున్నారు.

బి.టి.ప్రత్తి పండిస్తున్న పొలాల్లో సారం తగ్గిపోయి, ఉత్పత్తి క్షీణిస్తోందని రైతులు చెప్తున్నారు. తమ లాభాల వేటలో ఈ జన్యుమార్పిడి విత్తనాల కార్పొరేషన్లు, ప్రత్యామ్నాయాలను(ఆహారపు) ధ్వంసం చేస్తున్నాయని శాస్త్రజ్ఞులు పదేపదే హెచ్చరిస్తున్నారు.

ఎన్నో అద్భుతాలు సాధిస్తుందన్న ఈ బి.టి. (జన్యుమార్పిడి) సాంకేతికతతో యిప్పటివరకూ అనావృష్టిని తట్టుకోగల, ఉప్పునీటిలో పండగల-విత్తనాలను సృష్టించనేలేకపోయారు. అయినా ఆ కార్పొరేషన్లు మాత్రం దారిద్ర నిర్మూలనకూ, ఆహార సంక్షోభానికీ ఈ జన్యుమార్పిడి పంటలే సర్వరోగ నివారిణి అన్నట్లు ప్రచారం చేసుకొంటూ లాభాలను దండుకొంటున్నాయి.

జన్యుమార్పిడి విత్తనాల పంటలు తెచ్చిపెట్టిన-తెచ్చిపెడ్తున్న ఈ అనర్థాలను గురించిన వివరాలు యింత స్పష్టంగా మన కళ్ళముందేవున్నా, భారత పాలకులు మాత్రం వీటిని చూడటానికి, పట్టించుకోవటానికి నిరాకరిస్తున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదపు సేవలో తరిస్తున్న, దళారీలుగా వుంటూ అంతో-యింతో ఆర్థిక తదితర లాభాలను మూటగట్టుకొంటున్న ఈ పాలకులు దేశపు వ్యవసాయరంగం ధ్వంసమయినా(జన్యుమార్పిడి పంటలవలన సాంప్రదాయకపంటలు, క్షేత్రాలూ కలుషిత మయిపోతున్నాయి కాబట్టి, పర్యావరణం కలుషితమయి పోతోందికాబట్టి) జన్యుమార్పిడి పంటలనే, జన్యుమార్పిడి విత్తనాలనే పెంచిపోషించటానికి నడుంకట్టారు.

అందుకనే వారు మనదేశంలో 74 రకాల జన్యుమార్పిడి పంటలను పరిశోధించటానికి భారతదేశాన్ని పరిశోధనా క్షేత్రంగా మలచివేశారు. జన్యుమార్పిడి పంటలకు పుట్టిల్లయిన అమెరికాలో కేవలం ఆరురకాల పంటలకే అనుమతినిస్తే, మన దేశ పాలకులు జన్యుమార్పిడి విత్తన కంపెనీలు తమ యిష్టారాజ్యంగా అన్నిరకాల జన్యుపంటల పరీక్షలనూ నిర్వహించటానికి అనుమతినిచ్చారు.

పరిశోధన జరపటానికి కనీసపు వసతులు లేకపోయినా, మనదేశంలో సుమారు 400 ప్రభుత్వ, ప్రవేటు సంస్థలకు అనుమతినిచ్చారు. ప్రస్తుతం ఆ సంస్థలు పరిశోధనలు నిర్వహిస్తున్నాయి.

ఆపిల్, అరటి, బొప్పాయి, పుచ్చకాయలాంటి పండ్లను పండించగల జన్యుమార్పిడి విత్తనాలపైనా,

బంగాళాదుంప, టొమాటో, క్యారట్, బఠానీ, వంకాయ, కాలీఫ్లవర్, కంద, బెండ, దోసకాయ, ఉల్లిపాయలాంటి కూరగాయల విత్తనాలపైనా,

వరి, గోధుమ, మొక్కజొన్నలాంటి ధాన్యాలపైనా,

నల్లమిరియాలు, ఏలకులు, అల్లం, అశ్వగంధ, బ్రహ్మిలాంటి సుగంధ ద్రవ్యాలపైనా,

కాఫీ, తేయాకులాంటి పానీయాల విత్తనాలపైనా,

వేరుశనగ, సోయాబీన్‌లాంటి విత్తనాలపైనా,

ప్రత్తి, ఆవాలు, చెరకు, వెదురు, జనుము, ఆముదం, రబ్బరు, పుగాకులాంటి వాణిజ్యపంటలపైనా, ప్రస్తుతం మనదేశంలో జన్యుమార్పిడి విత్తనక్షేత్ర పరీక్షలు జరుగుతున్నాయి.

వీటికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం వ్యక్త మవుతున్నా, పాలకులు ప్రజాభిప్రాయాన్ని లక్ష్యపెట్టక, జన్యుమార్పిడి విత్తన కార్పొరేషన్ల సేవలో ముందుకే సాగుతున్నారు.

ఈ అనర్థంనుండి రక్షించుకోవటానికి దేశంలో ఒక బలమైన, నిలకడైన ప్రజాఉద్యమం సాగాల్సిన అవసరం ఎంతో వుంది.

D

---

## కరువు కోరల్లో... (5వ పేజీ తరువాయి)

బాధ్యతను గుర్తెరిగి ఈ క్రింది సహాయక చర్యలను వెంటనే చేపట్టాలి.

- నిబంధనలను మార్చి, దుర్భిక్షానికి గురైన ప్రాంతాలన్నింటినీ కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి.
- కరువు ప్రాంతాలకు తగినవిధంగా నిధులు కేటాయించి సహాయక చర్యలు అమలుచేయాలి.
- మంచినీరు, పశుగ్రాసం అందించాలి.
- గ్రామీణ ఉపాధి హామీపథకం క్రింద కరువు పనులు చేపట్టి కనీస వేతన చట్టాన్ని అమలు పర్చాలి. గ్రామీణ పేదలందరికీ ఒక్కొ కుటుంబానికి ఉచితంగా 15వేల రూపాయలు, తక్కువ ధరకే నిత్యావసర వస్తువుల ప్యాకేజీని అమలుపర్చాలి. ఈ విధమైన చర్యలతో వలసలను నివారించాలి.
- పంటలు కోల్పోయిన రైతులందరికీ సేద్యపు ఖర్చులు పూర్తిగా పరిహారంక్రింద చెల్లించాలి. ప్రతి పంటకు బీమాపరిహారం వర్తించేవిధంగా చర్యలు తీసుకోవాలి.
- చిన్న, సన్నకారు రైతుల అన్నిరకాల బ్యాంక్ అప్పులను రద్దుచేయాలి. తిరిగి వడ్డీలేని అప్పులు ఇవ్వాలి.
- గ్రామీణ ప్రజలందరికీ చౌకడిపోల ద్వారా అతితక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలి.
- ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు ధరలు తగ్గించాలి.
- పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్టు సౌకర్యం కల్పించాలి. నేరుగా రైతులనుండే ప్రభుత్వ సంస్థలు ధాన్యాలు కొనుగోలు చేయాలి. మద్దతు ధరను 2 వేలుగా ప్రకటించాలి.
- కరువు ప్రాంతాల్లోని విద్యార్థుల ఫీజులు రద్దుచేయాలి.
- గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సౌకర్యం అందించాలి.
- వర్షం, వరదలవలన వచ్చే నీటిని నిల్వచేసేందుకు రాష్ట్రంలోని చెరువులన్నిటికీ యుద్ధప్రాతిపదికపై మరమ్మత్తులు చేపట్టాలి. ఆనకట్టలు, రిజర్వాయర్లు, చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు నిర్మించాలి.

కరువు పీడిత రైతాంగం సహాయం పొందటం తమ హక్కుగా పై డిమాండ్ల పరిష్కారానికై ప్రభుత్వంపై పోరాటం సాగించాలి. వారిని బిక్షగాళ్ళగా చూసే విధానాలను ప్రభుత్వం విడనాడాలి.

D

## కాకినాడ సెజ్... (చివరి పేజీ నుండి)

గుంజుకోవడానికి వస్తే "తలపాగాలు చుట్టండి, కర్రలు పట్టండి, ఐక్యంగా సెజ్ అధికారులను తరిమి కొట్టండి" అన్నారు. భూమి, నీటిపై హక్కు ప్రజలదేనని; గ్రామాల్లో గ్రామసభలదే సర్వాధికారమనీ; మా ఊళ్లో మా రాజ్యం అనీ ప్రజలంతా నినదించాలన్నారు.

ప్రొఫెసర్ కె.ఆర్ చౌదరి మాట్లాడుతూ మూడు పంటలు పండే పచ్చని పొలాలను సాగుకు యోగ్యం కాని భూములని ప్రకటించడం విచిత్రమని వాటికి అవార్డులు ప్రకటించటం శోచనీయమని కాకినాడ సెజ్ పేరిట జరిగిన మోసం పాలకుల విధానాలకు అద్దంపడుతున్నదని అన్నారు.

రైతుకూలీసంఘం అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ కాకినాడసెజ్ ప్రాంత రైతుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పైరుపచ్చ విప్లవం పేరిట జరిగిందంతా అన్యాయమేనని కోనసీమలో రుజువైందన్నారు. ఏజన్సీలో ప్రాజెక్టుల పేర, కంపెనీల పేర గిరిజనుల్ని అడవినుండి, భూమినుండి గెంటి వేయడానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నామని, కోనసీమ వ్యవసాయ సంక్షోభం, సెజ్‌ల పేరిట భూములు గుంజుకోవటానికి కారణమైన పాలకుల, సామ్రాజ్యవాదుల దోపిడీ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. సెజ్ వ్యతిరేక పోరాటాన్ని దేశవ్యాపితంగా ప్రచారం చేస్తామన్నారు. ప్రస్తుతం భూములను జీఎంఆర్ కంపెనీకి కట్టబెట్టడాన్ని ఖండించారు. ఈ ప్రాంత ప్రజలపై పెట్టి కేసులన్నీ రద్దు చేయాలని, సేకరించిన భూములన్నింటినీ రైతులకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేసారు. మొత్తంగా ఈ పర్యటనలోను, సభల్లోను దళిత బహుజన వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఐ. సూర్యనారాయణ, సెజ్ వ్యతిరేకపోరాట కమిటి నాయకులు రాజేంద్ర, చింతా సూర్యనారాయణమూర్తి, బావిశెట్టి నారాయణస్వామి, పేకేటి యజమాని, గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

D


## మనదేశ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లు



కాపీలకు :
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2



## కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా ?

పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-

మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
ఏలూరురోడ్, విజయవాడ

ప్రముఖ వ్యవసాయార్ధికవేత్త ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి ప్రారంభోపన్యాసంచేస్తూ ఈనాడు రైతులు-కౌలు సమస్య, ప్రభుత్వ భూసేకరణ, తీవ్ర కరువు, గిట్టుబాటు ధరలు, పంట విరామం వంటి ప్రధానమైన సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, ప్రకటించాల్సింది, పంటవిరామం కాదనీ, పాలకుల విధానాలపై పోరు సాగించాలనీ అన్నారు.

కౌలురైతుల సమస్యలపై మాట్లాడుతూ దేశంలో 60 శాతం పంట విస్తీర్ణం కౌలు రైతుల ద్వారా సాగవతుండగా, కౌలు రైతుల రక్షణకోసం చేసిన చట్టాలన్నింటినీ ప్రభుత్వాలు ప్రక్కనబెట్టాయనీ, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతుల్లోనూ, ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలోనూ అత్యధికులు కౌలు రైతులేననీ, రైతుల పేరిట 16,600 కోట్ల సంస్థాగతరుణాలిచ్చామని ప్రభుత్వం ప్రకటిస్తున్న వానిలో 130 కోట్లు మాత్రమే కౌలు రైతులకు రుణాలుగా అందాయనీ అన్నారు. కావున కౌలు రైతుల చట్టాలను పటిష్టపరిచి సక్రమంగా అమలు చేయాలనీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, సంస్థాగత రుణాలను కౌలు రైతులకు అందించేందుకు పోరాడాలని ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి పిలుపునిచ్చారు.

భారతజన్ ఆందోళన్ ఛైర్మన్, ఎస్‌సి.,ఎస్‌టి జాతీయమాజీ కమీషనర్, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్) డా॥ బి.డి.శర్మ ముఖ్యవక్తగా ప్రసంగిస్తూ గ్రామీణ భారతాన్ని విధ్వంసం చేసేందుకు పాలకులు కుటిల విధానాలను రూపొందించి అమలు చేస్తున్నారనీ, ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూసేకరణ-పునరావాస బిల్లు కూడా రైతుల, ఆదివాసీల ప్రయోజనాలకు వ్యతిరేకమైనదనీ అన్నారు. రైతుల శ్రమను నైపుణ్యంలేని శ్రమగా (Unskilled) పేర్కొనటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MNREGA) గురించి మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కూలీలకు వందరోజుల పని కల్పించకపోగా, ఈ పథకం పీకలలోతు అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ఉపాధిహామీ పథకం కారణంగా వ్యవసాయ కూలిరేట్లు పెరిగాయనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఎఐకెఎమ్‌కెఎస్ (ఆల్‌ఇండియా ఖేత్‌మజ్దూర్, కిసాన్ సభ) కన్వీనర్ కా॥ సుబోధ్‌మిత్ర సందేశమిస్తూ వీరోచిత తెలంగాణా, శ్రీకాకుళ ఉద్యమాల వారసత్వం కలిగిన ఆంధ్రదేశంలోని రైతుకూలీ ఉద్యమం ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి కారకులైన పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, దున్నేవానికే భూమిహక్కుకై ఉద్యమాన్ని సాగించటంలోనూ ముందు నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇంకా ఈ ప్రారంభసభలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు భూపతి నారాయణమూర్తి, దళిత బహుజన కార్మికసంఘం రాష్ట్రకార్యదర్శి కా॥ఐ.సూర్యనారాయణ, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకురాలు కా॥ అమలేందు, ఎన్‌వైఎస్ రాష్ట్ర నాయకులు కా॥బి. సుబ్బారావు సందేశాలనిచ్చారు.

ప్రజాకళాకారులు కిందిరి, డప్పుల డ్యాన్స్‌లను ప్రదర్శించారు. రైతాంగ సమస్యలపై, అమరవీరులపై ప్రజాకళాకారులు పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

## బహిరంగ సభ

**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)** జనరల్‌కౌన్సిల్ సందర్భంగాకాకినాడలోని హెచ్.ఎమ్.ఎస్. కార్యాలయ ప్రాంగణంలో 24-10-11 సా॥ 6 గం॥కు బహిరంగ సభ జరిగింది. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ కుంజం రామారావు వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, సంఘం రాష్ట్రనాయకులు కా॥ యం.యస్. నాగరాజు బహిరంగసభకు అధ్యక్షత వహించారు.

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ కానేటి మోహనరావు మాట్లాడుతూ రైతుకూలీసంఘం త్యాగపూరితంగా, నిబద్ధతతో పనిచేయటాన్ని స్వాగతించారు. స్వాతంత్ర్యం లభించిందనుకుంటున్న నాటినుండి ఈ నాటికి పెద్దలకు-పేదలకు మధ్య అంతరాలు తీవ్రంగా పెరిగిపోయాయనీ, ప్రభుత్వం భూసంస్కరణల అమలు తీరును చూస్తే పేదల అనుభవంలోనున్న భూములను కూడా తిరిగి భూస్వాములకు కట్టబెట్టినట్లయిందనీ వివరిస్తూ 1950లలో తాను రాష్ట్ర వ్యవసాయ కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కాలంలో - సమరశీలంగా సాగిన రైతు, కూలీ ఐక్య ఉద్యమాలనొక్కసారి గుర్తుచేశారు. కులాతీతంగా పేదవారినందరినీ ఒక వర్గంగా ఆనాటి కమ్యూనిస్టు పార్టీ సమీకరించి భూస్వాములకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించిందనీ, కాగా ఈనాడు పాలకులు తమ కుటిల విధానాలతో పీడిత కులాలనే తలా ఓదిక్కు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సంక్షుభిత రాజకీయార్ధిక నేపథ్యంలో రైతు, కూలీ ఉద్యమ కార్యకర్తలు మరింత అంకితభావం, త్యాగనిరతితో గ్రామాల్లోకి వెళ్లి పీడిత ప్రజలతో మమేకమై దోపిడీ వ్యతిరేక పోరాటాలను నిర్మిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, రైతుకూలీ ఉద్యమాలకు ఎల్లవేళలా తన సంఘీభావం వుంటుందని ప్రకటిస్తూ తన ఉపన్యాసాన్ని ముగించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాపితంగా రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో సాగుతున్న పోరాటాలను వివరించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట, కాకరాపల్లి; విజయనగరంజిల్లా కోటిపాం; ప్రకాశంజిల్లా కనపర్తి; నెల్లూరుజిల్లా అంకులపాటూరులలో ధర్మల్‌విద్యుత్ కేంద్రాల స్థాపనపేరిట భూముల సేకరణకు, మత్స్యకారుల జీవన విధ్వంసానికీ, విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి వ్యతిరేకంగానూ, శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో అణువిద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగానూ పేదరైతులు, మత్స్యకారులు, గ్రామీణ పేదలు, ప్రజాతంత్రవాదులు సాగిస్తున్న నిరసనాందోళనలను లక్ష్యపెట్టకుండా ప్రభుత్వం ఆయా ఉద్యమాలపై యాజమాన్య గూండాల దాడులను ప్రోత్సహించటాన్ని, పోలీసు దాడులతో రైతులను కాల్చిచంపటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 5,6, షెడ్యూళ్ళ ప్రకారం కొండకోనల్లోని ఆదివాసులకు రక్షణ కల్పించవలసివుండగా, రాష్ట్రంలోని అనేక ఆదివాసీ గ్రామాలను డీ షెడ్యూలు ప్రాంతంగా ప్రకటించటాన్ని తీవ్రంగా నిరసించారు. ఆదివాసీ హక్కుల చట్టం పేరిటనే ఆదివాసుల హక్కులను హరించి వేయటాన్ని; 1/70 చట్టాన్ని అమలు చేయకపోవటాన్ని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట వందలాది ఆదివాసీ గ్రామాలను విస్థాపనకు గురిచేయటాన్ని ఆమె తీవ్రంగా నిరసించారు.

రైతుకూలీసంఘం రాష్ట్రం కోశాధికారి కామ్రేడ్ యద్దనపూడి సోని మాట్లాడుతూ కోస్టల్ కారిడార్‌తో తీరప్రాంత మత్స్యకారుల జీవనం మరింత దుర్భరమైందన్నారు. కోస్టల్ రెగ్యులేటరీ చట్టాన్ని తుంగలోతొక్కి మెరైన్‌పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, తీరప్రాంత రక్షణ బృందాల గస్తీలు, మీదు మిక్కిలి విదేశీ బడా ఫిషింగ్ ట్రాలర్లకు విచ్చలవిడి అనుమతులివ్వటానికి వ్యతిరేకంగా రైతులు, గ్రామీణ పేదలతో కలసి మత్స్యకారులు పోరాడాలన్నారు.

ప్రపంచాధిపత్యవ్యూహంలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాద నాటోకూటమి సేనలు లిబియా అధ్యక్షుడు గఢాఫీని కాల్చిచంపటాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు తన ప్రసంగంలో తీవ్రంగా ఖండించారు.

ఇంకా ఈ బహిరంగసభలో డా॥ బి.డి. శర్మ, ప్రొ॥ కె.ఆర్. చౌదరి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కా॥ ఇల్లా రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

## ప్రజలను ఆకట్టుకున్న రైతుకూలీల ఊరేగింపు, ప్రజాకళారూపాలు

బహిరంగసభ ప్రారంభానికి ముందుగా సాయంత్రం 4 గంటలకు స్థానిక సూర్యకళామందిర్ నుండి జగన్నాధపురం హెచ్‌ఎమ్‌ఎస్ కార్యాలయ ఆవరణలోని బహిరంగ సభావేదిక వరకు, రైతుకూలీ, ఆదివాసుల ప్రజాప్రదర్శన జరిగింది. ఎర్రజెండాలు, బ్యానర్లతో, ఉద్యమ నినాదాలతో; ప్రదర్శన ముందుభాగాన ప్రజాకళాకారుల నృత్యాలతో సాగిన ప్రదర్శన ఆసాంతం కాకినాడ ప్రజలను ఆకట్టుకుంది. ప్రదర్శనకారులు 'దున్నేవానికే భూమిహక్కు', 'భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు వర్ధిల్లాలి' 'సద్దాం, గడాఫీలను హత్యగావించిన అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి' 'ప్రకటించాల్సింది-పంటవిరామంకాదు, సాగించాల్సింది-పాలకుల విధానాలపై పోరు' 'కౌలు రైతుల హక్కులు కాపాడాలి' 'వ్యవసాయ కూలీలకు భూమి పంపిణీ చేయాలి' 'సెజ్‌ల పేరిట సేకరించిన భూములను తిరిగి రైతులకే అప్పగించాలి' 'డీషెడ్యూలు ప్రాంత ఆదివాసులను షెడ్యూలు ప్రాంతంలో చేర్చాల'నే ప్రధాన నినాదాలతో స్త్రీపురుషులు క్రమశిక్షణతో ప్రదర్శనలో పాల్గొనటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

బహిరంగ సభా వేదికపై మహిళా ప్రజాకళాకారుల బృందం-భూస్వామ్య, జమిందారీ వ్యతిరేక రైతాంగ, పీడిత ప్రజల పోరాటాల్లో పాల్గొని ప్రాణాలర్పించిన అమరుల త్యాగాల గాధలను 'నెత్తుటి దీపాలు' అనే కళారూపం ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## ప్రతినిధుల సభ

**రైతుకూలీసంఘం** (ఆం.ప్ర.) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ రెండవరోజున (25-10-11న) వివిధ జిల్లాల నుండి ఎంపిక చేయబడిన ప్రతినిధులతో సమావేశం జరిగింది.

ఈ సెషన్‌కు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ వర్మ, లలిత, యాకూబ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

తొలుత ప్రతినిధులనుద్దేశించి ఎఐకెఎమ్‌కెఎస్ (ఆల్‌ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్‌సభ) కన్వీనర్ కా॥ సుబోధ్‌మిత్రా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న రైతుకూలీసంఘంతో సహా 11 రాష్ట్రాలలో విస్తరించి, రైతుకూలీల మధ్య, ఆదివాసుల మధ్య రైతుకూలీ ఉద్యపు కృషిని సాగిస్తున్నామంటూ, ఎఐకెఎమ్‌కెఎస్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళటంలో ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న రైతుకూలీ ఉద్యమం ప్రాధాన్యతను కలిగివుందన్నారు.

రాష్ట్ర వ్యాపితంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో వివిధ జిల్లాలలో జరిగిన కార్యకలాపాల నివేదికను సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సీ ప్రవేశపెట్టగా ప్రతినిధులందరూ చర్చలలో పాల్గొని నివేదికను ఆమోదించారు.

కౌలురైతుల సమస్యలపై సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె. కిషోర్‌బాబు; పంట విరామం అంశంపై సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ఎమ్.ఎస్.నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలోని రైతాంగం, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. **(పంట విరామం, కౌలురైతాంగ సమస్యలపై వివరమైన తీర్మానాలు వచ్చేసంచికలో)**

# 'సముద్ర జలాల్లో చేపలవేట (నియంత్రణ-నిర్వహణ)చట్టం-2009 రద్దుచేయాలి'

## బందరులో జరిగిన బహిరంగసభలో కా॥కోటయ్య డిమాండ్



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కా॥ కోటయ్య

**బందరు, 29-10-11:** తీరప్రాంతంలో మత్స్యకారుల సాంప్రదాయక వేట హక్కును కాలరాస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సముద్రపువేట-(నియంత్రణ-నిర్వహణ) బిల్లు 2009ను రద్దుచేయాలని, కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ చట్టానికి, గుల్లలమోదలో ఏర్పాటుచేస్తున్న క్షిపణి ప్రయోగకేంద్ర నిర్మాణానికి, కోస్టల్ గార్డ్స్, మెరైన్ గస్తీదళాల వేధింపులకు వ్యతిరేకంగా, తీరప్రాంత ప్రకృతి వనరులపై ప్రాథమిక హక్కులకోసం, తీరప్రాంత బంజరు భూముల సాధనకోసం సమైక్య ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపునిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కృష్ణాజిల్లా కమిటి ఆధ్వర్యంలో స్థానిక కోనేరు సెంటర్‌లో బహిరంగసభ జరిగింది. ఈ సభకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు కా॥కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బహిరంగసభలో తొలుత రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య ప్రసంగిస్తూ తీరప్రాంత ప్రజల బ్రతుకులను ఛిద్రంచేసే దళారీ పాలకులు, సముద్ర మత్స్యసంపద ఉత్పత్తి పెంపుదల, ప్రజలందరికీ అధిక మాంసకృత్తులుగల ఆహారం అందించే ధ్యేయం అనే పేరుతో సముద్రపు చేపల వేట (నియంత్రణ- నిర్వహణ)-2009 చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారనీ కానీ వాస్తవానికి అది తీరప్రాంత ప్రజల పాలిట శాపమైందన్నారు. 1960లలో పాలకులు ఆర్భాటంగా ప్రారంభించిన "నీలివిప్లవం" ఫలితంగా మత్స్యకారులు, పెద్దపెద్ద మరబోట్లలో దినసరి కూలీలుగా మారారు. చేపలు, రొయ్యలువంటి సముద్ర ఉత్పత్తులన్నీ విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఇందుకు కేటాయించిన నిధులన్నీ సంపన్న వర్గాలు, విదేశీ కంపెనీలు కైంకర్యం చేసాయి. ఈ పరిస్థితిలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సముద్రపు చేపలవేటబిల్లు సముద్ర వనరులపై స్వదేశీ, విదేశీ బడాకంపెనీల ఆధిపత్యం నెలకొనేలా, సముద్రంలో చేపలు వేటాడే మత్స్యకారులను సాంప్రదాయక చేపలవేటనుండి వెళ్ళగొట్టేందుకు ఉద్దేశించబడిందే తప్ప మరేమీ కాదు. ఈ బిల్లు ప్రకారం సముద్రంలో చేపలవేట సాగించాలంటే బోట్‌లైసెన్స్, మత్స్యశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేకుండా హద్దులు దాటితే 3 ఏళ్ళు జైలుశిక్ష, 9 లక్షలు జరిమానా విధిస్తారు. మరబోట్లుకు పసుపు రంగును వేయాలని మెరైన్ పోలీసుల, కోస్టల్ గార్డ్స్ వేధింపులు తీవ్రమయ్యాయి. ఈ బిల్లు అమలులోకి వచ్చాక 125 విదేశీ ట్రాలర్లకు అనుమతులు మంజూరుచేశారు. ఈ రకంగా కాకుల్నికొట్టి గ్రద్దలకు వేసే విధానాలను దళారీ పాలకులు అమలుచేస్తున్నారు. మత్స్యకారులు తమ మనుగడకోసం, సముద్రంలో చేపలవేట హక్కుసాధనకై ఉద్యమించాలని కా॥కోటయ్య పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ ప్రసంగిస్తూ తీరప్రాంత వనరులను దోచుకొనేందుకు అనేక దుష్ట పథకాలతో, అభివృద్ధిపేరుతో అమెరికా సామ్రాజ్యవాదులు ముందుకొస్తున్నారన్నారు. "ఇందుకు దళారీ పాలకులు తీరప్రాంత రక్షణకు ఉద్దేశించిన కోస్టల్ రెగ్యులేటరీ జోన్‌ను రద్దుచేసి కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. ఫలితంగా తీరప్రాంతమంతటా ధర్మల్ విద్యుత్ కేంద్రాలు, రసాయనిక పరిశ్రమలు, పోర్టులు, పెట్రోకారిడార్, కోస్టల్‌కారిడార్ పేరుతో నెలకొల్పేందుకు పూనుకొంటున్నారు. కె.జి.బేసిన్‌లో ఉన్న అపారమైన ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను ఇక్కడ నుండి తరలించుకు పోవడాన్నే అభివృద్ధిగా పాలకులు నమ్మబలుకుతున్నారు. అమెరికా ప్రపంచ ఆధిపత్యంలో భాగంగా 330 ఎకరాల విస్తీర్ణంలో గుల్లలమోదలో కేంద్రరక్షణశాఖ క్షిపణి ప్రయోగకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తీరప్రాంత ప్రజల ప్రయోజనాలను బలిపెట్టే అమెరికా యుద్ధ అవసరాల కొరకు ఈ క్షిపణి ప్రయోగకేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఒరిస్సాలో బలియాపాల్‌లో ఏర్పాటు చేయబోయిన క్షిపణి ప్రయోగ కేంద్రంకు వ్యతిరేకంగా రైతాంగం, మత్స్యకారులు వీరోచితంగా ఉద్యమించి క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని నిలుపుదలచేశారు. ఆ స్ఫూర్తితో తీరప్రాంత రైతాంగం, మత్స్యకారులు ఉద్యమించాలని కా॥భార్గవశ్రీ పిలుపునిచ్చారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్రకార్యదర్శి కా॥యద్దనపూడి సోని మాట్లాడుతూ మత్స్యకారుల సాంప్రదాయక చేపలవేట హక్కును కాలరాస్తూ కేంద్రప్రభుత్వం సముద్ర చేపలవేట బిల్లు తెస్తుంటే రష్యా, జపాన్ దేశాలకు చెందిన ట్రాలర్లు సముద్రంలో మత్స్యసంపదను ఊడ్చేస్తుంటే; కోస్టల్ రెగ్యులేటరీ జోన్‌ను రద్దుచేసి కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్‌ను ఏర్పాటుచేసి కాలుష్యాన్ని వెదజల్లే, పర్యావరణ సమస్యలు ఉత్పన్నమయ్యే అణువిద్యుత్ కేంద్రాలు, ధర్మల్ విద్యుత్ కేంద్రాలు, రసాయనిక పరిశ్రమలకొరకు వేల, లక్షలాది ఎకరాల భూములను దౌర్జన్యంగా ప్రభుత్వం గుంజుకుంటూంటే గుడ్లప్పగించి చూస్తున్న ప్రజాప్రతినిధులైన రాజకీయ నాయకుల బండారాన్ని సోదాహరణంగా ఎండగట్టారు. సముద్రపు ఇసుక తిన్నెల్ని తవ్వేసి అందులో సిలికాన్, డోలమైట్‌వంటి ఖనిజాలను తరలించేందుకు పాలకులు యధేచ్ఛగా అనుమతులిస్తున్నారు. తీరప్రాంత రక్షణకోసం సహజసిద్ధంగా ఏర్పడిన ఇసుక తిన్నెలు ఒక్కో లేయర్ ఏర్పడటానికి 20 సం॥రాలకాలం పడుతుందని జియాలజిస్టులు చెప్పుతున్నారు. మత్స్యసంపద అభివృద్ధికి దోహదపడే, తీరప్రాంత రక్షణకు ఉపయోగపడే మడ అడవులను విచక్షణా రహితంగా నరికేస్తున్నారు. చేపలవేట నిషేధకాలంలో విదేశీ ట్రాలర్లు నిరాఘాటంగా వేటాడేస్తుంటే అధికారులు ఏంచేస్తున్నారు? నిషేధ కాలంలో మత్స్యకారులకు ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, ఆర్థిక సహకారం అందివ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ స్థితిలో మనుగడకోసం మత్స్యకారులు, తీరప్రాంత ప్రజానీకం సమైక్యంగా ఆందోళన సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని'' అన్నారు. ఇంకా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా సహాయకార్యదర్శి కా॥వీరబాబు, జిల్లా నాయకులు జె.జగన్ తీరప్రాంత ప్రజల జీవితాలను ఛిద్ర చేస్తున్న పాలకుల విధానాలను ఎండగట్టారు. ప్రజాకళాకారులు "ధరలు బాబోయ్ ధరలు" వీధినాటికను ప్రదర్శించారు. జనంపాటలు పాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకొన్నాయి. బహిరంగసభకు నాగాయలంక, చల్లపల్లి, చిన్నాపురం, మచిలీపట్నం ఏరియాలనుండి మత్స్యకారులు, రైతులు, కూలీలు, మహిళలు 300మందికి పైగా పాల్గొన్నారు. బహిరంగసభకు వారంరోజుల ముందునుండీ నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం మండలాలలోని పలు గ్రామాల్లో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ప్రచార బృందాలు విస్తృతప్రచారం నిర్వహించాయి.

# 'విరామం లేని పోరుబాటే రైతాంగం ముందున్న కర్తవ్యం'

## రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పిలుపు





సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న కా॥ వనచర్ల సుబ్బారావు; ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రొ॥ కె.ఆర్. చౌదరి; జనరల్ కౌన్సిల్‌కు హాజరైన ప్రతినిధులు

**కాకినాడ, 2011 అక్టోబర్ 24,25 తేదీలు :**

'వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి', 'దున్నేవానికే భూమి' కేంద్ర నినాదాలుగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు స్థానిక సూర్య కళామందిర్‌లో స్ఫూర్తిదాయకంగా జరిగాయి.

తొలుత, జిల్లాలో రైతుకూలీ ఉద్యమ సీనియర్ నాయకులు, వయోవృద్ధులు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ వనచర్ల సుబ్బారావు రైతుకూలీ ఉద్యమాలలో ఎరుపెక్కిన రైతుకూలీసంఘం జెండాను-రాష్ట్ర వ్యాపితంగా వివిధ జిల్లాల నుండి హాజరైన ప్రతినిధుల ఉద్యమ నినాదాలననడుమ-ఆవిష్కరించారు. ఉత్తేజకరమైన ఉద్యమ నినాదాలనడుమ ఈ కార్యక్రమాన్ని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఎం. ఎస్. నాగరాజు నిర్వహించారు.

జనరల్ కౌన్సిల్ ప్రారంభసభకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి అధ్యక్షత వహించారు. 2010 ఏప్రిల్‌లో ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల నుండి ఈ జనరల్ కౌన్సిల్ మధ్యకాలంలో మృతిచెందినఅమరులకు ప్రతినిధులందరూ లేచినిలబడి రెండు నిమిషాలు మౌనంవహించి ఘన నివాళు లర్పించారు.

అధ్యక్షోపన్యాసంలో కా॥ ఝాన్సీ ప్రస్తుత దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించారు. 'దొంగే, దొంగ ...దొంగ' అని కేకలు వేస్తున్న తీరులో పాలకపార్టీలన్నీ వ్యవహరిస్తున్నాయనీ, తమ తమ అవినీతి చరిత్రలను ఒకరివొకరు బయటపెట్టుకుంటూ, ఆచరణలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు కార్యాచరణలోకి రాకుండా గందరగోళపరుస్తున్నారనీ; సత్యాగ్రహాల ద్వారానో, ఫేస్‌బుక్‌లు, నెట్‌మెసేజ్‌ల ద్వారానో లేదా జనలోక్‌పాల్ వంటి చట్టాల ద్వారానో అవినీతి అంతంకాదని, దీనికివ్యతిరేకంగా మూలాలనుండీ ప్రజానీకం పోరాడాలని పిలుపునిచ్చారు.

సెజ్‌ల పేరుతో, ప్రాజెక్టులు-గనులు పేరుతో భూముల దురాక్రమణ సాగిస్తూ ప్రజలను విస్థాపనకు గురిచేస్తున్న పాలకులే, మరోవేపున తామే ప్రజలను ఉద్ధరిస్తున్నామని, భూములు పంచుతున్నామని మభ్యపెడుతున్నారన్నారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా ప్రధానంగా వ్యవసాయ కూలీలు, పేదరైతులు కునారిల్లిపోతున్నారనీ, దీనిని మరుగుపరుస్తూ పాలకులు అభివృద్ధి ముసుగులో పేదల, గిరిజనుల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. సామ్రాజ్యవాద, బడాకార్పోరేట్ కంపెనీలకు మౌలిక సదుపాయాల కల్పన పేరున దేశాన్ని దోపిడీ చేయడాన్ని నిరసిస్తూ రైతాంగం ఇతర పీడితవర్గాల ప్రజలతో కలసి తమ సమస్యల పరిష్కారానికై ఉద్యమింప జేయటం మినహా మరోదగ్గరి పరిష్కారం లేదని కా॥ ఝాన్సీ పేర్కొన్నారు.

(తరువాయి 7వ పేజీలో)



రైతు, కూలీ ఉత్తేజకరమైనపజాప్రదర్శన



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కా॥ కానేటి మోహనరావు;



బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

## కాకినాడ సెజ్ ప్రాంతంలో మేధావులతో కలసి రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) బృందం పరిశీలన

**కాకినాడ, 23-10-11 :**

తూ॥గో॥జిల్లా ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి మండలాల్లో 2004లో ఓ.యన్.జి.సి. రిఫైనరీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రెండువేల ఐదువందల ఎకరాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. తర్వాత 2005లో తొమ్మిదివేల ఎకరాలకోసం నోటిఫికేషన్ ఇచ్చింది. రైతుల నుంచి బలవంతంగా కొనుగోలు చేయడం ప్రారంభించింది. తర్వాత రిఫైనరీ ప్రతిపాదన రద్దుచేసి, కాకినాడ సెజ్‌కోసం భూములు కొనుగోలు చేశారు. కాకినాడ సెజ్ నోటిఫికేషన్ తర్వాత కెవిఆర్ పేరిట వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్లు చేసారు. రెవిన్యూ అధికారుల, పోలీసుల సాయంతో రైతులను బెదిరించి, భయపెట్టి భూములను కొనేశారు. 2006 నుంచి ఇప్పటి వరకు 7,500 ఎకరాలు సేకరించారు. ఇప్పటి వరకు ఎలాంటి పరిశ్రమలు రాకపోగా నేడు ఆ భూములన్నీ జిఎంఆర్‌కు కెవిఆర్ అమ్మివేసాడు.

ప్రస్తుతం ఆ భూముల నుంచి రైతులను భౌతికంగా గెంటి వేయడానికి పోలీసులను తెచ్చి దాడులు చేయిస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్బంధ భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉద్యమాలు, జరుగుతున్నాయి ప్రజలపై, ఆందోళనకారులపై ప్రభుత్వం-నిర్బంధం, బలప్రయోగం చేయటమేకాక 360కి పైగా అక్రమ కేసులు బనాయించింది.

ఈ నేపథ్యంలో భారత్ జనాందోళన్ ఛైర్మన్ డాక్టర్ బి.డి. శర్మ (రిటైర్డ్ ఐ.ఏ.ఎస్.); ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్స్ ఝాన్సీ, కోటయ్య; సంఘం నాయకులు కామ్రేడ్స్ జె. కిషోర్‌బాబు, నాగరాజు తదితరులు అక్టోబర్ 23న యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో అన్ని గ్రామాల వ్యవసాయ భూములను పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులను పరామర్శించారు. కోనపాపపేట (యు.కొత్తపల్లి మండలం); వాకదారిపేట (తొండంగి మండలం)లలో జరిగిన సభలలో మాట్లాడారు.

డా॥ బి.డి.శర్మ మాట్లాడుతూ సెజ్‌ల పేరిట భూముల సేకరణేగాక కెవిఆర్ లాంటి వ్యక్తులకు భూములు కట్టబెట్టటాన్ని తప్పుపట్టారు. చట్టప్రకారమైనప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పరిశ్రమలూ రానందున ఆయా భూములపై హక్కు రైతులదేనన్నారు. వందల సం॥లుగా తరతరాలుగా జీవిస్తున్న ప్రజలకు లేని హక్కు, అరవై సంవత్సరాల క్రితం ఏర్పడిన ప్రభుత్వానికి ఎక్కడిదన్నారు. బలవంతంగా భూములు

(తరువాయి 6వ పేజీలో)





కాకినాడ సెజ్ పేరిట రైతులనుండి గుంజుకున్న భూములను పరిశీలిస్తున్న బృందం సభ్యులు; కోనపాపపేటలో సెజ్ బాధితులనుద్దేశించి ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సీ; హాజరైన రైతులు,గ్రామస్తులు

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010